ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

# నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక -78 పేజీలు - 08 వెల - 04/- ఆదివారం 29 డిసెంబర్ 2024

## 104 అంబులెన్స్ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా చర్యలు

### వైద్య ఆరోగ్య శాఖలో కీలక ప్రతిపాదనలకు సీఎం చంద్రబాబు ఆమోదం

### వైద్య ఆరోగ్య శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష

### 190 కొత్త 108 వాహనాల కొనుగోలుకు పచ్చజెండా



ఏపీ సీఎం చంద్రబాబు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖపై సమీక్ష నిర్వహించారు. వైద్య ఆరోగ్య శాఖలో పలు కీలక ప్రతిపాదనలకు ఆయన ఆమోదం తెలిపారు. 190 కొత్త 108 వాహనాల కొనుగోలుకు పచ్చజెండా ఊపారు. ఇందుకు రూ.60 కోట్ల వ్యయం కానుంది. 108 డ్రైవర్లకు జీతంతో పాటు అదనంగా రూ.4 వేలు ఇచ్చే విధానాన్ని మళ్లీ తీసుకురావాలని సీఎం నిర్ణయించారు. పేదలు ఆసుపత్రుల్లో చనిపోతే వారి మృతదేహాలను తరలించే మహాప్రస్థానం వాహనాల సంఖ్యను మరింత పెంచేందుకు ఆమోదం తెలిపారు. ఇక, ఎన్టీఆర్ బీమా విధానంలో రాష్ట్రాన్ని రెండు యూనిట్లుగా విభజించే పథకం అమలు చేయాలన్న ప్రతిపాదనకు చంద్రబాబు ఆమోదం తెలిపారు. మిగతాది 2లో...

## మన్మోహన్ సింగ్‌కు తుది వీడ్కోలు





**నిగమ్‌బోధ్ ఘాట్‌లో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు**

**నివాళి అర్పించిన రాష్ట్రపతి ముర్ము, ఉపరాష్ట్రపతి ధన్‌కడ్**

**ప్రధాని మోడీ, మంత్రులు, స్పీకర్ తదితరులు**

**కాంగ్రెస్ కార్యాలయం నుంచి ఘాట్ వరకు అంతిమయాత్ర**

న్యూఢిల్లీ,డిసెంబర్28ఆంధ్ర ప్రగతి: ఇక సెలవ్ అంటూ ఆర్థికవేత్త మన్మోహన్ నింగికేగారు. దివంగత మాజీ ప్రధానికి వీడ్కోలు పలికారు. దివికేగిన దివంగత నేతకు ప్రముఖులు కడసారి శ్రద్ధాంజలి ఘటించారు. అనారోగ్యంతో తుదిశ్వాస విడిచిన భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అంత్యక్రియలు ముగిశాయి. దిల్లీలోని నిగమ్‌బోధ్ ఘాట్‌లో ఆయన పార్థివదేహానికి ప్రభుత్వ లాంఛనాలతో అంతిమ సంస్కారాలు పూర్తి చేశారు. కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ పాడె మోశారు.రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, జేపీ నడ్డా, కిరణ్ రిజిజు, కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, దిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా హాజరై మాజీ ప్రధానికి తుది వీడ్కోలు పలికారు.మిగతాది 2లో...

## సంక్రాంతికి హైదరాబాద్ నుంచి ఏపీకి ప్రత్యేక బస్సులు

### జనవరి 9 నుంచి 13 మధ్య 2,400 స్పెషల్ సర్వీసులు

### అదనపు ఛార్జీలు లేకుండానే నిర్వహణ ప్రకటించిన ఏపీఎస్ఆర్టీసీ



విజయవాడ,సెంబర్28ఆంధ్ర ప్రగతి: సంక్రాంతి పండుగకు తెలంగాణ రాజధాని నగరం హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లే ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఏపీఎస్ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. జనవరి 9 నుంచి జనవరి 13 వరకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్టు ప్రకటించింది. హైదరాబాద్ నుంచి ఏపీలోని వివిధ ప్రాంతాలకు మొత్తం 2,400 స్పెషల్ బస్సులు నడపనున్నట్లు వెల్లడించింది.ఎలాంటి అదనపు ఛార్జీలు లేకుండానే ఈ ప్రత్యేక బస్సుల్లో ప్రయాణించవచ్చని స్పష్టం చేసింది. పండుగ వేళ ప్రజలపై ఖర్చుల భారాన్ని తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రకటనలో అధికారులు తెలిపారు. చిత్తూరు, నెల్లూరు, కర్నూలు, అనంతపురం, ఒంగోలు, మాచర్లతో పాటు వేర్వేరు ప్రదేశాలకు వెళ్లే సాధారణ బస్సులు, స్పెషల్ బస్సులు హైదరాబాద్ నగరంలోని ఎంజీబీఎస్‌కు ఎదురుగా ఉన్న సీబీఎస్ నుంచి బయలుదేరతాయని అధికారులు తెలిపారు.

## వైకాపా నేతలకు కళ్లు నెత్తికెక్కాయి

**ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే గట్టిగా బుద్ధి చెబుతాం**

- ఇది వైకాపా రాజ్యం అనుకుంటున్నారా?
- గాలివీడు ఎంపీడీవో జవహర్ బాబుకు పరామర్శ
- దాడి గురించి ఆరా తీసిన పవన్ కళ్యాణ్



కడప,డిసెంబర్28ఆంధ్ర ప్రగతి:అహంకారంతో వైకాపా నేతలకు కళ్లు నెత్తికెక్కాయని డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ఘాటుగగా హెచ్చరించారు. ఇది కూటమి ప్రభుత్వం.. వైకాపా రాజ్యం అనుకుంటున్నారా.. ఖబడ్దార్. ఇష్టారాజ్యంగా చేయలేరు. మీ అహంకారం ఎలా అణచివేయాలో మాకు తెలుసు. చేసి చూపిస్తాం. అధికారులపై దాడి చేస్తే తోలు తీస్తాం' అని పవన్ కళ్యాణ్ హెచ్చరించారు. మిగతా 2లో



2లో

## నేను ఎక్కడికీ పారిపోలేదు

**లాయర్ల సూచన మేరకు మీడియా ముందుకు రాలేదన్న పేర్ని నాని**

**పోలీసు విచారణ కంటే సోషల్ మీడియాలో రచ్చ ఎక్కువయిందని అసహనం**

**తనను, తన కుమారుడిని అరెస్ట్ చేయాలని చూస్తున్నారని మండిపాటు**

## ఏపీలో 'స్మార్ట్ పోలీస్ ఏఐ' వ్యవస్థ వినియోగం

### అమలు చేస్తున్న ఏలూరు జిల్లా పోలీసులు

**పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో లక్ష సీసీ కెమెరాల అనుసంధానం**

**డిజిపి ద్వారకా తిరుమల రావు వెల్లడి**

విజయవాడ,డిసెంబర్28ఆంధ్ర ప్రగతి: స్మార్ట్ పోలీసింగ్‌లో భాగంగా దేశంలోనే తొలిసారి ఏపీలో 'స్మార్ట్ పోలీస్ ఏఐ' వ్యవస్థను వినియోగిస్తున్నట్లు డిజిపి ద్వారకా తిరుమల రావు తెలిపారు. ప్రస్తుతం ఏలూరు జిల్లా పోలీసులు ఈ స్మార్ట్ పోలీస్ ఏఐను అమలు చేస్తున్నారు. కేసు నమోదు నుంచి విచారణ వరకూ ఈ స్మార్ట్ పోలీస్ ఏఐ విచారణాధికారికి సహకరిస్తుంది. మిగతా 2లో



## రాజ్యాంగ రచనలో తెలుగువారి పాత్ర చిరస్మరణీయం

**ప్రముఖుల చిత్రాలతో వినూత్నంగా అసెంబ్లీ క్యాలెండర్ ఆవిష్కరించిన సిఎం చంద్రబాబు నాయుడు**



2లో

## శతక్కొట్టిన నితీశ్‌కుమార్ రెడ్డి

**మెల్‌బోర్న్ టెస్ట్‌లో రికార్డు శతకం**



7లో

# వైకాపా నేతలకు కళ్లు నెత్తికెక్కాయి

(మొదటి పేజీ తరువాయి)



కడప రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గాలివీడు ఎంపీడీవో జవహర్ బాబును డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పరామర్శించారు.

ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధితుడికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం పవన్ మీడియాతో మాట్లాడారు. 'గాలివీడు ఎంపీడీవో జవహర్‌బాబును అమానుషంగా కొట్టారు. అధికారులపై దాడి చేయడం వైకాపాకు కొత్త కాదు. ఆధిపత్యం, అహంకారంతో అధికారులపై దాడులు చేస్తే ఎలాంటి శిక్షలు పడతాయో చూపిస్తాం. పులివెందుల నియోజకవర్గంలో ఓ రైతు కుటుంబం ఆత్మహత్యపై పవన్ స్పందించారు. ఆ ఘటన బాధాకరమని.. దీనిపై విచారణ జరుగుతోందని పేర్కొన్నారు. రెండ్రోజుల క్రితం రైతు తన భూమి మ్యుటేషన్ పెట్టుకున్నారని.. ఎలాంటి పరిస్థితుల్లో ఈ ఘటన జరిగిందో నివేదిక వచ్చాక చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.అన్నమయ్య జిల్లా గాలివీడు ఎంపీడీవో జవహర్‌బాబుపై దాడి జరిగిన విషయం తెలిసిందే. ప్రస్తుతం కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఆయన్ని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పరామర్శించి దాడి గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం పవన్ మీడియాతో మాట్లాడుతూ ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు. బాధ్యులను వదిలిపెట్టమని హెచ్చరించారు. ఇదిలాఉండగా, పవన్‌ని చూసేందుకు అక్కడికి వచ్చిన పలువురు అభిమానులు అత్యుత్సాహం ప్రదర్శించారు. ఆయన సీరియస్‌గా మీడియాతో మాట్లాడుతున్న సమయంలో 'ఓజీ.. ఓజీ.. ఓజీ' అంటూ స్లోగన్లు చేశారు. దీనిపై ఆయన ఆగ్రహానికి గురయ్యారు. 'ఏంటయ్యా మీరు. ఎప్పుడు ఏ స్లోగన్ ఇవ్వాలో మీకు తెలియదు. పక్కకు రండి' అంటూ తన అసహనాన్ని తెలియజేశారు. పవన్‌కల్యాణ్ ప్రస్తుతం రాజకీయాల్లో ఎంతో బిజీగా ఉన్నారు. వరుస మీటింగ్స్, సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. మరోవైపు, దర్శక - నిర్మాతలకు ఇబ్బందులు కలగకుండా ఇప్పటికే పట్టాలెక్కించిన సినిమాలను పూర్తిచేస్తున్నారు. తన తదుపరి చిత్రాలు 'ఓజీ', 'హరిహర వీరమల్లు' షూట్స్‌లో వీలు కుదిరినప్పుడు పాల్గొంటున్నారు. సుజీత్ దర్శకత్వంలో ఆయన నటిస్తోన్న చిత్రమే 'ఓజీ'. యాక్షన్ థ్రిల్లర్ ఫిల్మ్‌గా ఇది సిద్ధమవుతోంది. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై దానయ్య నిర్మిస్తున్నారు.

# రాజ్యాంగ రచనలో తెలుగువారి పాత్ర చిరస్మరణీయం

## ప్రముఖుల చిత్రాలతో వినూత్నంగా అసెంబ్లీ క్యాలెండర్ ఆవిష్కరించిన సిఎం చంద్రబాబు నాయుడు

అమరావతి,డిసెంబర్28ఆంధ్ర ప్రగతి:

రాజ్యంగ రచనలో తెలుగువారి పాత్ర చిరస్మరణీయమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ప్రముఖుల చిత్రాలు, చరిత్రను తెలిపేలా వినూత్నంగా రూపొందిచిన అసెంబ్లీ క్యాలెండర్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు పూర్తి చేసుకుందని.. దీంతో ఆనాటి రాజ్యాంగ రచనలో భాగస్వాములైన తెలుగు ప్రముఖులను స్మరించేలా క్యాలెండర్ రూపొందించినట్లు తెలిపారు. 2025 సంవత్సరానికి రూపొందించిన నూతన అసెంబ్లీ క్యాలెండర్‌ను తన నివాసంలో శనివారం సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. గోబ్యాక్ సైమన్ అంటూ తెగువ చూపిన ధీరుడు టంగుటూరి ప్రకాశం పంతులు రాజ్యాంగ రచనలో భాగస్వామి కావడం



గర్వకారణమని అన్నారు. రాజ్యాంగంలోని స్థానిక సంస్థలు, గవర్నర్ విచక్షణ అధికారాలు వంటి అంశాల రూపకల్పనలో సహాయ సహకారాలు టంగుటూరి ప్రకాశం పంతులు అందించారని చెప్పారు. బోగరాజు పట్టాభి సీతారామయ్య రాజ్యాంగ సభా సంప్రదింపుల కమిటీలో సభ్యుడిగా సేవలు అందించారని అన్నారు. దుర్గాభాయ్ దేశ్‌ముఖ్ జాతీయ భాష, న్యాయవ్యవస్థ, స్వాతంత్ర్యం, మానవ అక్రమ రవాణాపై చేసిన కీలక సూచనలకు రాజ్యాంగ సభ ఆమోదం తెలిపిందని చెప్పారు. జాతీయ భాష గురించి మోటూరి సత్యనారాయణ, అధికార వికేంద్రీకరణ, అత్యవసర అధికారాలు రెండు సభలు ఆంధ్రరాష్ట్ర ఏర్పాటుపై ఎన్జీ రంగా సూచనలు చేశారన్నారు. వీరితో పాటు వీసీ కేశవరావు, అల్లాడి కృష్ణస్వామి, మొసలికంటి తిరుమలరావు, కళా వెంకట్రావులు తమ వంతు సేవలు అందించారని గుర్తుచేశారు. ఇలాంటి వారి చిత్రపటాలతో అసెంబ్లీ క్యాలెండర్‌ను రూపొందించి ఆవిష్కరించడం సంతోషంగా ఉందని సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ అయ్యన్న పాత్రుడు, డిప్యూటి స్పీకర్ రఘురామకృష్ణంరాజు తో పాటు అసెంబ్లీ సెక్రటెరీ జనరల్ సూర్యదేవర ప్రసన్న కుమార్ హాజరయ్యారు.

# ౩౦ నుంచి తిరుమలలో అధ్యయనోత్సవాలు

## జనవరి 10 నుంచి 19 వరకు వైకుంఠద్వార దర్శనం - దర్శనం టిక్కెట్లు ఉన్నవారికే అనుమతి

## 91 కేంద్రాల్లో టోకెన్ల అమ్మకం- టిటిడి ఇవో శ్యామలరావు వెల్లడి

తిరుమల,డిసెంబర్28ఆంధ్ర ప్రగతి:

తిరుమలలో వైకుంఠఏకాదశి కార్యక్రమాలు ఘనంగా జరుగుతాయి. 2025 జనవరి 10 వైకుంఠఏకాదశి సందర్భంగా 10 రోజుల పాటు అనగా జనవరి 10 నుంచి 19 వతేదీ వరకు తిరుమల శ్రీవారి ఆలయంలో వైకుంఠద్వార దర్శనాన్ని ఏర్పాటు చేస్తామని టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. తిరుమల అన్నమయ్య భవనంలో శనివారం నిర్వహించిన డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో ఆయన భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. తిరుమల శ్రీవారి ఆలయంలో డిసెంబరు 30వ తేదీ నుండి అధ్యయనోత్సవాలు ప్రారంభమవుతాయి. ధనుర్మాసంలో వైకుంఠ ఏకాదశికి 11 రోజులు ముందు నుండి శ్రీవారి సన్నిధిలో అధ్యయనోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందివైకుంఠ ద్వార దర్శనం కొరకు భక్తులు క్యూలైన్లలో ఎక్కువ సమయం వేచి ఉండాల్సిన అవసరం లేకుండా భక్తులకు టైంస్లాట్ టోకెన్లు జారీ చేస్తామని తెలిపారు. ఈ టికెట్లను ( రూ. 300 .. ప్రత్యేక దర్శనం ) ఇప్పటికే ఆన్ లైన్ లో విడుదల చేశామన్నారు. ఇక శ్రీవాణి దర్శన టికెట్లు జనవరి 10న 1500, మిగిలిన 9 రోజులకు 2000 టికెట్లు మరియు గదుల కోటాను డిసెంబరు 23న ఆన్‌లైన్‌లో విడుదల చేసినట్లు డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో తెలిపారు. - ఆన్‌లైన్‌లో దర్శనం బుక్ చేసుకున్న దాతలకు రూ.300/- ప్రత్యేక ప్రవేశ దర్శన క్యూలైన్ ద్వారా దర్శనానికి అనుమతిస్తారు. సామాన్య భక్తుల సౌకర్యార్థం జనవరి 8 నుండి 11వ తేదీ వరకు దాతలకు గదుల కేటాయింపు ఉండదు. మిగతారోజుల్లో దాతలు యథావిధిగా గదులు బుక్ చేసుకోవచ్చని ఈవో శ్యామలరావు తెలిపారు. తిరుపతిలోని 8 కేంద్రాలలో 87 కౌంటర్లు, తిరుమలలో 4 కౌంటర్లు కలుపుకుని మొత్తం 91 కౌంటర్ల ద్వారా టోకెన్లు మంజూరు చేస్తారు. జనవరి 10, 11, 12 తేదీలకు సంబంధించి మొదటి మూడు రోజులకు జనవరి 9వ తేదీన ఉదయం 5 గం.ల నుండి 1.20 లక్షల టోకెన్లు జారీ చేయాలని టీటీడీ నిర్ణయం తీసుకుంది. జనవరి13 నుండి 19వ తేదీ వరకు ఏ రోజుకారోజు ముందు రోజు భూదేవి



కాంప్లెక్స్, శ్రీనివాసం, విష్ణు నివాసంలలో టోకెన్లు జారీ చేస్తారు. సర్వదర్శనం టోకెన్ల కలిగిన భక్తులు తమకు కేటాయించిన సమయానికి తిరుమలకు వచ్చి స్వామివారి దర్శించుకోవాలని విజ్ఞప్తిచేశారు. గోవిందమాల భక్తులు కూడా దర్శన టోకెన్లు పొంది దర్శనానికి రావాలని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం తిరుపతిలో ఇందిరా మైదానం, రామచంద్ర పుష్కరిణి, శ్రీనివాసం కాంప్లెక్స్, విష్ణునివాసం కాంప్లెక్స్, భూదేవి కాంప్లెక్స్, భైరాగిపట్టెడలోని రామానాయుడు ఉన్నత పాఠశాల, ఎంఆర్ పల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జీవకోనలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అదేవిధంగా తిరుమల స్థానికుల కొరకు తిరుమల బాలాజీ నగర్ కమ్యూనిటీ హాల్‌లో టోకెన్ కౌంటర్లు ఏర్పాటు చేశారు. కౌంటర్లు ఏర్పాటు చేస్తున్న ప్రాంతాల్లో భక్తులకు ప్రత్యేకంగా క్యూలైన్లు, బారీకేడ్లు, తాగునీరు, మరుగుదొడ్లు తదితర సదుపాయాలు కల్పిస్తామని ఈవో తెలిపారు. దర్శనటోకెన్లు గల భక్తులను మాత్రమే తిరుమల శ్రీవారి దర్శనానికి అనుమతిస్తామని తెలిపారు. చంటిపిల్లల తల్లిదండ్రులతో పాటు వృద్ధులు, దివ్యాంగులు, ఎన్ఆర్ఐ, రక్షణ సిబ్బంది తదితర ప్రత్యేక దర్శనాలను ఈ పది రోజులపాటు రద్దు చేయడమైనది. భక్తుల రద్దీ దృష్ట్యా వైకుంఠ ద్వార దర్శనం ఏర్పాటు చేసిన 10 రోజులలో (జనవరి 10 నుంచి 19 వరకు) విఐపి బ్రేక్ దర్శనాలకు సిఫార్సు లేఖలు స్వీకరించరు.. అయితే ప్రోటోకాల్ పరిధిలోని ప్రముఖులు స్వయంగా వస్తే వారికి మాత్రం శ్రీవారి దర్శనం కల్పించడం జరుగుతుంది. జనవరి 7న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరుగుతుంది. జనవరి 10న వైకుంఠ ఏకాదశి నాడు ఉదయం 9 నుండి 11 గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారు స్వర్ణరథంపై ఆలయ నాలుగుమాడ వీధులలో భక్తులకు దర్శనమిస్తారు. జనవరి 11న వైకుంఠ ద్వాదశి సందర్భంగా ఉదయం 5.30 నుండి 6.30 గంటల వరకు చక్రస్నానం ఉంటుంది. 2025వ సంవత్సరం డైరీలు, క్యాలెండర్లు తిరుమల, తిరుపతితోపాటు చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, విజయవాడ, వైజాగ్‌లోని శ్రీవారి ఆలయాలు, ముంబయి, న్యూఢిల్లీ, వేలూరు, కాంచీపురంలోని సమాచార కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయి. ఆన్‌లైన్ ద్వారా కూడా క్యాలెండర్లు, డైరీలు బుక్ చేసుకునే సౌకర్యాన్ని కల్పించారు. హిందు ధర్మ ప్రచారంలో భాగంగా ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని ప్రయాగ రాజ్(అలహాబాద్) వద్ద 2025 జనవరి 13 నుండి ఫిబ్రవరి 26వ తేది వరకు నిర్వహించనున్న ప్రతిష్టాత్మక కుంభమేళాలో శ్రీవారి నమూనా ఆలయాన్ని ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే ప్రయాగ్‌రాజ్‌లోని భజరంగ దాస్ రోడ్డు, వాసుకీ ఆలయం ప్రక్కనే గల సెక్టారు 6 నందు శ్రీవారి ఆలయం నమూనా కోసం స్థలాన్ని కేటాయించారు. ఉత్తరాది భక్తులు శ్రీవారి వైభవాన్ని సంతృప్తిగా తిలకించేలా తిరుమల తరహాలో స్వామివారి కైంకర్యాలు, ఉత్సవాలు నిర్వహిస్తారు. ప్రతిరోజు ఈ నమూనా ఆలయంలో తిరుమల తరహాలో నిత్యం సుప్రభాతం నుండి ఏకాంత సేవ వరకు సేవలు నిర్వహిస్తామని . తిరుమలలో మాదిరిగానే శ్రీవారి కళ్యాణాలు జనవరి 18, 26, ఫిబ్రవరి 3, 12 తేదీలలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఈవో శ్యామలరావు తెలిపారు. నవంబరు నెలలో శ్రీవారిని 20.35 లక్షల మంది భక్తులు దర్శించుకోగా.. హుండీ ద్వారా రూ.111.30 కోట్లు ఆదాయం సమకూరింది. ఇంకా లడ్డూల ద్వారా రూ. 97.01 లక్షలు ఆదాయం వచ్చింది. 19.74 లక్షల మంది నవంబర్ నెలలో అన్నప్రసాదాన్ని స్వీకరించగా.. 7.31 లక్షల మంది భక్తులు తలనీలాలు సమర్పించారు.

# మన్మోహన్ సింగ్‌కు తుది వీడ్కోలు






(మొదటి పేజీ తరువాయి)

త్రివిధ దళాల అధిపతులు మన్మోహన్‌కు నివాళులర్పించారు. అంత్యక్రియలకు దిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీ, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ హాజరయ్యారు. భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ నాంగ్యల్ వాంగ్‌చుక్, విదేశీ ప్రతినిధులు పాల్గొన్నారు. మన్మోహన్ పార్థివదేహాన్ని పార్టీ నేతలు, కార్యకర్తల సందర్శనార్థం శనివారం ఉదయం ఏఐసీసీ ప్రధాన కార్యాలయానికి తీసుకువచ్చారు. కాంగ్రెస్ నేతలు రాహుల్, సోనియా, ప్రియాంక గాంధీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎంపీ మల్లు రవి తదితరులు నివాళులర్పించారు. తర్వాత అక్కడినుంచి నిగమ్‌బోధ్ ఘాట్ వరకు అంతిమయాత్ర కొనసాగింది. ఈ సమయంలో రాహుల్.. మన్మోహన్ కుటుంబం వెన్నంటే ఉన్నారు.92 ఏళ్ల మన్మోహన్ సింగ్ వయసురీత్యా తలెత్తిన అనారోగ్య సమస్యలతో గురువారం రాత్రి ఇంటివద్ద అకస్మాత్తుగా స్పృహ కోల్పోయారు. దీంతో కుటుంబసభ్యులు ఆసుపత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. మన్మోహన్ పదేళ్ల పాటు దేశానికి ప్రధానిగా పని చేశారు. అంతకుముందు ఆర్‌బీఐ గవర్నర్‌గా వ్యవహరించారు. ప్రధానిగా పీవీ నరసింహారావు హయాంలో ఆర్థిక మంత్రిగానూ బాధ్యతలు నిర్వర్తించారు. అంతకుముందు మన్మోహన్ సింగ్ మృతికి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సంతాపం తెలిపారు. మాజీ ప్రధాని సతీమణి గురుశరణ్ సింగ్, కుటుంబసభ్యులకు బైడెన్ దంపతులు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈమేరకు వైట్‌హౌస్ ఓ ప్రకటన విడుదల చేసింది.

# ఏపీలో 'స్మార్ట్ పోలీస్ ఏఐ' వ్యవస్థ వినియోగం

(మొదటి పేజీ తరువాయి)

ట్రాఫిక్, క్రౌడ్ మేనేజ్‌మెంట్ కోసం విజయవాడ పోలీసులు 'ఏఐ వజ్రాస్త్రం' పేరిట ఏఐ సాంకేతికత వినియోగిస్తున్నారు' అని డీజీపీ తెలిపారు. విజయవాడలోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో 2025 మార్చి 31 నాటికి లక్ష సీసీ కెమెరాలు అనుసంధానిస్తామని ఏపీ డీజీపీ ద్వారకా తిరుమలరావు తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో ఇప్పటికే 25 వేలకుపైగా సీసీ కెమెరాలను నేర నియంత్రణకు వినియోగిస్తున్నామన్నారు. గతంతో పోలిస్తే సైబర్ నేరాలు విపరీతంగా పెరుగుతున్నాయన్నారు. ఈ ఏడాదిలో సైబర్ క్రైమ్‌కు సంబంధించి 916 కేసులు నమోదు కాగా.. సుమారు రూ.1,229 కోట్ల మేర నగదును సైబర్ నేరగాళ్లు కాజేశారని పేర్కొన్నారు. డిజిటల్ అరెస్టు అనేది లేదని.. అలాంటి కాల్స్‌ను ప్రజలు నమ్మొద్దన్నారు. కొత్తగా ప్రతి జిల్లాలో సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నాం. గంజాయి, డ్రగ్స్ కేసుల వ్యవహారంలో 'ఈగల్' వ్యవస్థ ప్రజల్లోకి బలంగానే వెళ్తోంది. 10,380 ఎకరాల్లో గంజాయి పంటను ధ్వంసం చేసి ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాల్సిందిగా గిరిజనులకు అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. 'డిప్యూటీ సీఎం భద్రతా వలయంలోకి నకిలీ ఐపీఎస్ రావడంపై విచారణ చేస్తున్నాం. అది భద్రతాపరమైన లోటు కాదని భావిస్తున్నాం. భూకబ్జాలు, ఇసుక అక్రమ తవ్వకాలు, రేషన్ బియ్యం అక్రమ రవాణాకు పాల్పడేవారిపై పీడీ యాక్టు నమోదు చేస్తున్నాం. సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టుల వ్యవహారంపై ఇప్పటివరకూ 572 కేసులు నమోదయ్యాయి. ఈ తరహా కేసుల్లో నిందితులపై రౌడీషీట్, సైబర్ షీట్‌లను నమోదు చేస్తున్నాం' అని డీజీపీ వెల్లడించారు.

# 104 అంబులెన్స్ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా చర్యలు



(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తుతానికి ట్రస్టు విధానంలో ఎన్టీఆర్ వైద్య సేవ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అయితే ఈ కార్యక్రమాన్ని బీమా విధానంగా మలిచేందుకు ఉన్న అవకాశాలపై నేటి సమీక్షలో చర్చించారు. గ్రామాల్లో వైద్య సేవలు అందించేందుకు 104 అంబులెన్స్ ల వ్యవస్థను మళ్లీ బలోపేతం చేయాలని నిర్ణయించారు. ఈ అంబులెన్స్ ల్లో ల్యాబ్ టెక్నీషియన్ ను నియమించి, పలు రకాల వైద్య పరీక్షలు చేసే సౌకర్యాన్ని మళ్లీ కల్పించాలన్న ప్రతిపాదనకు కూడా ఆమోదం లభించినట్టు తెలుస్తోంది. అదే సమయంలో... 108, 104, ఎన్టీఆర్ బీమా పథకం సేవలను ఒకే కాల్ సెంటర్ ద్వారా నిర్వహించాలన్న ప్రతిపాదన కూడా కార్యరూపం దాల్చనుంది. ఈ ప్రతిపాదనపై సీఎం చంద్రబాబు నేటి సమీక్షలో అధికారులతో చర్చించారు.ఇక, ప్రివెంటివ్ హెల్త్ కేర్ పై శ్రద్ధ చూపించాలని, 104 వాహనాల ద్వారా రక్త పరీక్షలు, ఇతర సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించే విధానాన్ని పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వమే ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వారికి హెల్త్ కార్డులు ఇచ్చే విధానం తీసుకువస్తే మంచి ఫలితాలు ఉంటాయని సీఎం అభిప్రాయపడ్డారు. వైద్య రంగంలో ఏఐ సాంకేతికత సేవలు ఉపయోగించుకునేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని, అనారోగ్యంతో బాధపడే ప్రతి ఒక్కరూ ఆసుపత్రికి రావాల్సిన అవసరం లేకుండా, టెక్నాలజీ ద్వారా వైద్య సాయం పొందే విధానం రావాలని చంద్రబాబు ఆకాంక్షించారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ మెరుగైన, నాణ్యమైన వైద్యం అందించేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని అన్నారు.

# నేను ఎక్కడికీ పారిపోలేదు

డిసెంబర్28ఆంధ్ర ప్రగతి:

తాను పారిపోయానని తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని మండిపడ్డారు. 15వ తేదీ నుంచి మూడు రోజుల పాటు మచిలీపట్నంలోనే ఉన్నానని... తన లాయర్ల సూచన మేరకే మీడియా ముందుకు రాలేదని చెప్పారు. తాడేపల్లిలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తమ గోడౌన్ లో బియ్యం బస్తాలు తగ్గాయని చెపితే... దానికి నగదు చెల్లించామని... అయినా కక్ష కట్టి తమపై కేసులు నమోదు చేశారని దుయ్యబట్టారు. ఏదీ తేలక ముందే తనను దొంగ అంటున్నారని చెప్పారు. పోలీసు విచారణ కంటే సోషల్ మీడియాలో రచ్చ ఎక్కువయిందని అసహనం వ్యక్తం చేశారు. జనవరి 2వ తేదీలోగా తనను, తన కుమారుడిని అరెస్ట్ చేయాలనే ప్లాన్ లో ఉన్నారని పేర్ని నాని చెప్పారు. ఈ నెల 30వ తేదీన బెయిల్ పిటిషన్ పై తీర్పు ఉన్నందున అన్ని విషయాల గురించి మాట్లాడలేకపోతున్నానని తెలిపారు. తమ అధినేత జగన్ కంటే ఎక్కువగా తనను టార్గెట్ చేస్తున్నారని చెప్పారు.

## బాల అకాడమీ పాఠశాలలో ఆసక్తికరంగా జరిగిన కాషాయ రంగు ఆక్టివిటీ.



ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 28:

నంద్యాల పట్టణం లోని పార్కు రోడ్డు సమీపంలో గల బాల అకాడమీ పాఠశాల నందు "రంగులు- ప్రత్యేకతలు" అనే కార్యక్రమంలో భాగంగా శనివారము కాషాయరంగుఆక్టివిటీని పాఠశాల చిన్నారులు మరియు ఉపాధ్యాయ బృందం ఎంతో ఆసక్తికరంగా జరుపుకున్నారు ఈ సందర్భంగా పాఠశాల చిన్నారులు కాషాయ రంగు దుస్తులు ధరించి,కాషాయ రంగు వస్తువులు మరియు ఆహార పదార్థాలతో ఎంతో ఉత్సాహంగా కాషాయరంగు ఆక్టివిటీని జరుపుకోవడం జరిగినది. ఈ కార్యక్రమానికి పాఠశాల కరస్పాండెంట్ ఎం. జి.వి.రవీంద్రనాథ్ మరియు ప్రిన్సిపల్ మాధవీలత మాట్లాడుతూ కాషాయ రంగును యోగులు, మునీశ్వరులు ధరిస్తారు. కాషాయ రంగు వివేకాన్ని, పెంచుతూ ఆత్మ పరిశీలన చేసుకోవడానికి మరియు సమానత్వానికి,ప్రశాంతతకు, ఉత్సాహానికి, చలాకీగా ఉండటానికి మరియు మంచి ఆరోగ్యాన్ని చేకూరుస్తుంది. ఇంత విశిష్టత కలిగిన కాషాయ వర్ణం రోజును జరుపుకోవడం ఎంతో ఆనందకరమని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎం.జి.వి. రవీంద్రనాథ్ ప్రిన్సిపల్ శ్రీమతి మాధవీలత చిన్నారులు మరియు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలి

**- ఏపీ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్.**

**-ఐటిడిఏ ఆధ్వర్యంలో చెంచు కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాల.**

**-గిరిజన పిల్లలకు పాఠాలు చెప్పలేక పాఠశాల మూసివేత.**

**-అడిగే వారు లేరని ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న ఉపాధ్యాయులు.**



ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 28:

గాజులపల్లె గ్రామం చెంచుకాలనీలో ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రాథమిక పాఠశాలను ఉపాధ్యాయులు అనధికారికంగా మూసివేయడమే కాకుండా మరోచోట విధులు నిర్వహిస్తున్న ఆ ఉపాధ్యాయుడు ను వెంటనే సస్పెండ్ చేయాలని గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ డిమాండ్ చేశారు.శనివారం నంద్యాల జిపిఎస్ కార్యాలయంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూశ్రీశైలం ఐటీడీఏ పరిధిలోని చెంచుకాలనీలో ప్రాథమిక పాఠశాల ఉంది అయితే ఈ పాఠశాలలో ఉండాల్సిన విద్యార్థులు లేకపోవడం, ఉపాధ్యాయుడు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తుండటాన్ని పిల్లల తల్లిదండ్రులు గుర్తించారు. ఉపాధ్యాయుడు సుమంత్ బాధ్యతలు అప్పగించిన చోట కాకుండా మరోచోట విధులు నిర్వర్తిస్తూ పాఠశాల మూసివేతకు కారణమయ్యారని అన్నారు. పిల్లల చదువు పట్ల నిర్లక్ష్యం వహిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా విధులు నిర్వహించడం సిగ్గుచేటునారు. ఇప్పటికే ఐటిడిఎపిఓ ఆ పాఠశాలను తనిఖీ చేశారని వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. పాఠశాలను తెరచి పిల్లలు చదువుకునేందుకు అవకాశం కల్పించాలని కోరారు. ఉపాధ్యాయుడు సుమంత్ పై చర్యలు తీసుకోనీ విధుల నుండి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

# హిందూ దేవాలయాల స్వయం ప్రతిపత్తి లక్ష్యంగా హైందవ శంఖారావం




ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 28:

ఆంధ్రప్రదేశ్ లో హిందూ దేవాలయాల స్వయం ప్రతిపత్తి లక్ష్యం గా జనవరి5 న విజయవాడలోని గన్నవరం సమీపంలో గల కేసరపల్లి గ్రామంలో లక్షలాది మంది హిందువులతో ఒక భారీ బహిరంగ సభ హైందవ శంఖారావం నిర్వహిస్తున్నట్లు విశ్వ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు శ్రీ బుగ్గన చంద్రమౌళీశ్వర రెడ్డి విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో జరిగిన పత్రిక విలేకరుల సమావేశంలో తెలపడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఆధీనం నుండి హిందువులు దేవాలయాలను నిర్వహించుకునే విధంగా దేశవ్యాప్తంగా జాతీయ ఉద్యమం ప్రారంభమైందని విజయవాడ అందుకు వేదిక కాబోతుందని పేర్కొన్నారు.అదేవిధంగా హైందవ శంఖారావం రవాణా ప్రముఖ్ రాంప్రసాద్ మాట్లాడుతూ బ్రిటిష్ వాళ్లు 1897లో ప్రవేశపెట్టిన ఎండోమెంట్ చట్టాన్ని ఇప్పటికీ అవలంబించడం సరి కాదని తిరిగి రాజకీయ కబంధహస్తాల నుండి హిందువులే నిర్వహించుకునే విధంగా , దేవాలయ హుండీలో వేసిన కానుకలు హిందూ దేవాలయాలకు ధూప దీప నైవేద్యం నోచుకోని వాటికి ఉపయోగించాలని దేవాలయ ప్రాంగణంలో వ్యాపారం చేసేవాళ్లు హిందువులే అయి ఉండాలని, దేవాలయాల పై దాడులు సాధుసంతులపై దాడులు, గోవులపై దాడులు చేసే వారి పైన కఠిన చట్టాలు చేయాలని పేర్కొన్నారు.జిల్లావ్యాప్తంగా వందల సంఖ్యలో వాహనాలు విజయవాడకు చేరుకుంటున్నాయని , లక్షలాదిమంది ఆ సభలో పాల్గొంటారని నంద్యాల జిల్లా నుండి వెళ్లే ప్రతి వాహనదారుడు రవాణా రాంప్రసాద్ వద్ద వాహన పాస్ తీసుకుని వెళ్లినట్లయితే విజయవాడలో పార్కింగ్ కు అనుమతి ఉంటుందని , ప్రతి టోల్గేట్ దగ్గర ఎటువంటి ఆటంకాలు ఉండవని రాంప్రసాద్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రామాంజనేయులు , కమ్మయ్య , నాగరాజు , శేషసాయి తదితరులు పాల్గొన్నారు.

# గ్రీట్ విత్ గ్రీన్ పోస్టర్లను ఆవిష్కరించిన

## రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి.





ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 28:

జనవరి వేడుకలను మొక్కలతో లేదా విద్యా సామాగ్రితో జరుపుకుందాం అనే సందేశంతో కూడిన రెడ్ క్రాస్ సొసైటీ ముద్రించిన పోస్టర్లను రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి బనగానపల్లెలో మంత్రి కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి బి సి జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకలను మొక్కల ద్వారా జరుపుకొని నంద్యాల జిల్లాలో పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేద్దామని లేదా ప్రభుత్వ స్కూల్స్ లో, హాస్టల్స్ లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలలో ఉపయోగపడే విధంగా జామెంట్రీ బాక్స్, రఫ్ నోట్ బుక్స్ లాంటి విద్యాసామాగ్రిని అందజేయడం ద్వారా పేద విద్యార్థులకు సహకరించవచ్చు అని అన్నారు.బనగానపల్లె ప్రాంతంలో రెడ్ క్రాస్ కార్యక్రమాలకు అలాగే రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసే సేవా కేంద్రాలకు సహకారం అందించాలని మంత్రికి రెడ్ క్రాస్ వారు వినతి పత్రం అందించడం జరిగింది. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందిస్తూ కచ్చితంగా సహకరిస్తానని మంత్రి రెడ్ క్రాస్ వారికి హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నంద్యాల జిల్లా చైర్మన్ దస్తగిరి పర్ల, వైస్ చైర్మన్ మారుతి కుమార్, రెడ్ క్రాస్ జిల్లా కోశాధికారి నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యుడు ఉస్మాన్ భాష, బనగానపల్లె రెడ్ క్రాస్ కన్వీనర్ సైఫుల్ల, సత్యనారాయణ, అమీర్ బాషా, పరమేశ్వరుడు, సాధక్ బాషా, దాదా ఖాజా పీర్, తదితరులు పాల్గొన్నారు.

# నువ్వు పెంచిన విద్యుత్ ఛార్జీలపై.. నువ్వే ధర్నాలకు పిలుపివ్వడమేంటి జగన్..?

**-వైసీపీ ధర్నాలకు ప్రజల్లోనే కాదు...సొంత పార్టీలోనూ స్పందన లేదు.**

**-ఉనికి కోసమే ఆందోళన పేరుతో వైసీపీ డ్రామాలాడుతోంది.**

**-మా ప్రభుత్వంలో విద్యుత్ ఛార్జీలు పెంచే ప్రసక్తే లేదు...ఈ మాటకు కట్టుబడి ఉన్నాం.**

**-ఛార్జీల పెంపు పాపం జగన్‌దే...ఈ విషయం చిన్నపిల్లాన్ని అడిగినా చెప్తారు.**

**-జగన్ విధ్వంసం చేసిన విద్యుత్ శాఖను సీఎం చంద్రబాబు గాడిన పెడుతున్నారు.**

**-ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్.**



ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 28:

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇంత వరకూ విద్యుత్ చార్జీలను పెంచనేలేదని, జగన్‌మోహన్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు చేసిన పాపాల కారణంగా విద్యుత్ చార్జీలు పెరిగాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా నంద్యాల తెలుగుదేశం పార్టీ కార్యాలయం (రాజ్ టాకీస్) నందు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ 22.5 మిలియన్ యూనిట్ల కొరత ఉన్న రాష్ట్రాన్ని 2019 నాటికి మిగులు విద్యుత్ రాష్ట్రంగా తీర్చిదిద్ది .. వైసీపీ ప్రభుత్వానికి నాటి టీడీపీ ప్రభుత్వం అప్పగించిందన్నారు. 2014 నుంచి 2019 వరకు కూడా తెలుగుదేశం ప్రభుత్వం ఒక్క రూపాయి కరెంట్ చార్జీలు పెంచలేదని గుర్తు చేశారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. కానీ 2019 నుంచి 2024 వరకు అధికారంలో ఉన్న ప్రజలపై రూ.35 వేల కోట్ల విద్యుత్ భారాన్ని మోపడమే కాకుండా రూ.1.20 లక్షల కోట్ల నష్టాన్ని విద్యుత్ శాఖలో తెచ్చిపెట్టారన్నారు. గుట్టుచప్పుడు కాకుండా డిస్కంల ద్వారా ప్రజలపై భారం వేయండని ఈఆర్సీకి ప్రతిపాదనలు పంపారన్నారు. సాధారణంగా ఈఆర్సీకి పంపిన 90 రోజుల్లోపు ట్రూప్ అప్ చార్జీలు ఆమోదం పొందాలని... కానీ 2024 మే వరకు కూడా ట్రూప్ అప్ చార్జీలను వాయిదా వేస్తూ వచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈఆర్సీ నుంచి ఆమోదం పొందిన ట్రూప్ అప్ చార్జీలు నేడు ప్రజలపై భారంగా పడుతున్నాయని వివరించారు. ప్రతీ ఏటా విద్యుత్ వినియోగం సగటున 6 శాతం పెరుగుతుందని, పెరుగుతున్న డిమాండ్ కు తగ్గట్లు ఉత్పత్తిని కూడా పెంచాల్సి ఉంటుందని వివరించారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడే వీటీపీఎస్, కృష్ణపట్నం జెన్కో ప్లాంట్ల సామర్థ్యాన్ని విస్తరించామన్నారు. కానీ జగన్ మోహన్ రెడ్డి వాటిని పూర్తి చేయలేకపోయారన్నారు. అంతేకాకుండా జగన్ రెడ్డి చేసిన పెద్ద పొరపాటు పీపీఏలను రద్దు చేయడమని, పీపీఏల రద్దు కారణంగా 8 వేల మెగావాట్ల వరకు విద్యుత్‌ను ఏపీ కోల్పోవాల్సి వచ్చిందన్నారు. ఆ 8 వేల మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్‌ను సీఎం చంద్రబాబు తిరిగి అందుబాటులోకి తీసుకుని వచ్చారన్నారు. కేవలం సీఎం చంద్రబాబుకు పేరు వస్తుందన్న అక్కసుతోనే జగన్ రెడ్డి నాడు పీపీఏలను రద్దు చేశారన్నారు. పీపీఏలను రద్దు చేయడం కారణంగా విదేశీ బ్యాంకర్లు, పెట్టుబడిదారులు కేంద్రానికి ఫిర్యాదు చేశారని, ఈ కారణంగా విద్యుత్ వినియోగించుకోకపోయినా డబ్బు చెల్లించాల్సి వచ్చిందన్నారు. మరోవైపు జగన్ తన కమీషన్ల కక్కుర్తి కోసం ఎక్కువ రేటు కు విద్యుత్ కొనుగోలు చేశారని విమర్శించారు. జగన్ మోహన్ రెడ్డి ఐదేళ్ల కాలంలో కనీసం ఒక్క మెగావాట్ కూడా విద్యుత్ ఉత్పత్తి చేయలేదన్నారు. రాష్ట్రానికి జగన్ చేసినంత నష్టాన్ని ఏ రాజకీయ నాయకుడూ చేయలేదని దుమ్మెత్తి పోశారు. విద్యుత్ వ్యవస్థ గురించి మాట్లాడే అర్హత జగన్ కోల్పోయారన్నారు. విద్యుత్ చార్జీలపై జగన్ మోహన్ రెడ్డి ధర్నాలకు పిలుపునివ్వడం మరో తుగ్లక్ చర్య అని మండిపడ్డారు. తాను పెంచిన విద్యుత్ చార్జీలపై తానే ధర్నాలకు పిలుపునిచ్చారని ఎద్దేవా చేశారు. నాసిరకం విద్యుత్ కొనుగోళ్లపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని . విద్యుత్ శాఖకు అందించిన సేవలకు సన్మానం చేయాలని జగన్ అంటున్నారని, ప్రజలు ఇప్పటికే 11 సీట్లు ఇచ్చి జగన్‌ను ఘనంగా సన్మానించారన్నారు. జగన్ మోహన్ రెడ్డిపై కార్యకర్తలే తిరగబడే పరిస్థితిని తెచ్చుకున్నారన్నారు. కాంట్రాక్టు పనులు చేయించి బిల్లులు ఎగ్గొట్టారన్నారు. వైసీపీ కార్యకర్తలే జగన్ రెడ్డిపై తిరగబడే పరిస్థితి ఏర్పడిందన్నారు. తన ఐదేళ్ల పాలనలో 10 సార్లు విద్యుత్ చార్జీలను జగన్ పెంచారని గుర్తు చేశారు. నాడు జగన్ తెచ్చిన పాలసీలను చూసి ఒక్కరూ కూడా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రాలేదని, విద్యుత్ వ్యవస్థకు రూ.1.29 లక్షల కోట్లు మేర అప్పులు చేశారని విమర్శించారు. ప్రజలపై కరెంటు బిల్లు రూపంలో ఒక్క రూపాయి కూడా భారం వేయబోమన్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా విద్యుత్ ఛార్జీలు పెంచే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. జగన్ తప్పులతో నాశనమైన విద్యుత్ వ్యవస్థను చంద్రబాబు సరిదిద్దుతున్నారన్నారు. ప్రజల్లో ఉనికి కోల్పోయిన వైసీపీ ధర్నాలు చేస్తోందని, వైసీపీ డ్రామాలను ప్రజలు నమ్మరన్నారు. ధర్నాల్లో పాల్గొనాలని జగన్ ఇచ్చిన పిలుపునకు ప్రజల్లోనే కాకుండా, సొంత పార్టీలో కూడా స్పందన లేదన్నారు.

## వార్షిక ఫైరింగ్ ప్రాక్టీస్ లో పాల్గొని ,ఆయుధాల నైపుణ్యాలను పరీక్షించిన జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా.



ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 28 :నంద్యాల జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో కర్నూలు మండలం, దిన్నేదేవరపాడు గ్రామ దగ్గర ఉన్న జగన్నాథగట్టు సమీపంలోని ఫైరింగ్ రేంజ్ లో జిల్లాలోని పోలీసు అధికారులు 2024 సంవత్సరంకు గాను ఫైరింగ్ ప్రాక్టీస్ నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఆదిరాజ్ సింగ్ రాణా నేడు వార్షిక ఫైరింగ్ ప్రాక్టీస్ లో పాల్గొని పిస్టల్ ద్వారా ఫైరింగ్ సాధన చేశారు.పోలీసు అధికారులు తమ విధుల్లో వినియోగిస్తున్న ఆయుధాల పనితీరుపై పరిజ్ఞానం పెంపొందించుకోవాలని ఫైరింగ్ ప్రాక్టీస్ లో పోలీసులు విధుల్లో వినియోగించే ఆయుధాలతో ఫైరింగ్ చేయించారు.ఫైరింగ్ లో ప్రతి ఒక్కరు పాల్గొని మంచి మెళకువలు నేర్చుకోవాలన్నారు.శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసుల సేవలు చాలా కీలకమన్నారు. అత్యవసర సమయాలలో ప్రజల మాన,ధన,ప్రాణ రక్షణకై ఎల్లవేళలా సంసిద్ధులై ఉండాలన్నారు.ఫైరింగ్ లో ప్రతిభ కనబరచిన పోలీసు అధికారులను ఎస్పీ అభినందించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎన్.యుగంధర్ బాబు, జిల్లా సాయుధ బలగాల అడిషనల్ లెఫ్ట్ చంద్రబాబు, డిఎస్పీలు శ్రీనివాస్ రెడ్డి, రామంజి నాయక్, రవికుమార్ ,శ్రీనివాస్ లు , రిజర్వ్ ఇన్స్పెక్టర్లు మంజునాథ్ శ్రీనివాసులు నాగభూషణం మరియు జిల్లాలోని పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## జవహర్ బాబు పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

**-మంత్రి ఫరూక్ కు వినతి పత్రం అందజేసిన ఎంపీడీవోలు.**



ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 28:

శుక్రవారం నాడు అన్నమయ్య జిల్లా , గాలివీడు మండల పరిషత్ అధ్యక్షుడి కుమారుడు అయినటువంటి సుదర్శన్ రెడ్డి వారి పెత్తనానికి మండల పరిషత్ అభివృద్ధి అధికారి అయిన జవహర్ బాబు అడ్డుపడుతున్నాడని భౌతిక దాడి చేయడం హేయమైన చర్య అని, ఇలా చేయడం వల్ల పంచాయతీరాజ్ ఉద్యోగులు తీవ్ర ఆందోళనల గురవుతున్నారని , కావున అనునిత్యం ప్రజా సేవలో ఉండే పంచాయతీరాజ్ ఉద్యోగుల స్వేచ్ఛాయుత వాతావరణంలో , సమర్థవంతంగా పనిచేయవలెనని దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉద్యోగులకు భరోసా కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ కు నంద్యాల తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు ఎంపీడీవోలు వినతి పత్రం ఇవ్వడం జరిగింది.

# చేయి చేయి కలుపుదాం..

# ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం..!

## -బనగానపల్లెలో ప్లాస్టిక్ కు వ్యతిరేకంగా మెగా ర్యాలీ

### -మెగా ర్యాలీలో లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా, ఇతర ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు.







**ఆంధ్ర ప్రగతి**
**బనగానపల్లె/నంద్యాల, డిసెంబర్ 28:**

ప్రజల సహకారం లేనిదే ఏ కార్యక్రమాన్ని విజయవంతం చేయలేమని, ప్లాస్టిక్ రహిత సమాజాన్ని తీసుకురావాలంటే, వారి సహకారం అవసరమని రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అన్నారు. శనివారం బనగానపల్లెలోని మంత్రి క్యాంపు కార్యాలయం నుంచి మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి - ఇందిరమ్మ దంపతుల ఆధ్వర్యంలో ప్లాస్టిక్ కు వ్యతిరేకంగా మెగా ర్యాలీని నిర్వహించారు. ప్లాస్టిక్ రహిత బనగానపల్లె లక్ష్యంగా.. 'నా బనగానపల్లె - నా ఆరోగ్యం' పేరుతో నిర్వహించిన మెగా ర్యాలీలో నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా తదితరులు పాల్గొన్నారు. ఈ మెగా ర్యాలీకి వేలాదిగా తరలి వచ్చిన ప్రజలు, విద్యార్థులు, యువకులు, కార్యకర్తలు, పట్టణ ప్రముఖులు ప్లాస్టిక్ వ్యతిరేకంగా నినాదాలతో ర్యాలీని హోరెత్తించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వ్యతిరేకంగా ఏ కే అనిల్ టీమ్ వాళ్లు చేసిన ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. అలాగే ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులు చేసిన నృత్యం అందరినీ అలరించింది.. వారిని ప్రోత్సహిస్తూ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి రూ. 10 వేలు వారికి బహుమతిగా అందజేసారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ నా సతీమణి ఇందిరమ్మ ప్లాస్టిక్ రహిత కార్యక్రమం ప్రారంభించిన తొలినాళ్లలో ఎంత వరకు దీన్ని తీసుకెళ్లగమనే ఆలోచనలు ఉన్నప్పటికీ, ఆమె ఎంతో పట్టుదలతో ఈ కార్యక్రమాన్ని చేపట్టి ప్రజల్లో అవగాహన తీసుకురావడం ప్రతి మహిళకు ఇది ఎంతో స్ఫూర్తి ప్రదాయకమన్నారు. ఏదైనా కార్యక్రమం ప్రారంభించడం విజయవంతం చేయడం అంతా సులభం కాదని... మనకు ఎన్నైనా కోరికలు ఉండొచ్చు, కానీ ప్రజల సహకారం లేనిదే ఏ కార్యక్రమాన్ని కూడా ఏ ఒక్కరు, లేదంటే ఏ ప్రభుత్వం విజయవంతం చేయలేదన్నారు. ప్రజల సహకారం ఉన్నప్పుడే నా బనగానపల్లె - నా ఆరోగ్యం విజయవంతంమవుతోందన్నారు.. నేడు బనగానపల్లె ప్రజల్లో వచ్చిన మార్పు నాకు ప్రత్యక్షంగా కనిపిస్తోందన్నారు. గతంలో మండీ మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ కు వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమం పెట్టినప్పుడు వాళ్లు ఎంతో గొప్పగా సహకరిస్తామని మాట ఇవ్వడంతో దీనికి తొలి అడుగు పడిందన్నారు.. గత రెండున్నర నెలలుగా బీసీ ఇందిరమ్మ, శ్రీనయ్య అందరూ కలిసి ఈ ఉద్యమాన్ని ఎంతో గొప్పగా ముందుకు తీసుకెళ్లారని మంత్రి తెలిపారు. అలాగే స్కూళ్లు, కాలేజీలకు వెళ్లి సహకరించమని కోరినప్పుడు, వారంతా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహకరించడం అభినందనదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు కూడా ఎంతో ఉత్సాహంగా పాల్గొనడంతో పాటు, వారి తల్లిదండ్రుల్లో కూడా అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఏ కార్యక్రమైన విజయం సాధించాలంటే, మహిళల సహకారం అవసరమని మంత్రి అన్నారు. నేడు మహిళలంతా కలిసికట్టుగా ఈ ఉద్యమాన్ని మీ ఇంటి నుంచే మొదలు పెట్టాలని సూచించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బనగానపల్లెలో పర్యటించినప్పుడు, ఎక్కడికెళ్లినా, మురికికాల్వలు ప్లాస్టిక్ తో నిండిపోయి, రోడ్లపైకి చెత్త వచ్చే పరిస్థితి ఉందన్నారు.. ఇది ఎన్నిసార్లు తొలగించినా మళ్లీ, మళ్లీ వచ్చే పరిస్థితి నెలకొందన్నారు. నేడు మన ఇంటిని మాదిరిగా, మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలనే తపనతో పాటు మనకు సామాజిక బాధ్యత ఉండాలన్నారు. నేడు స్వచ్ఛ భారత్ పేరుతో ప్రధాని నరేంద్రమోదీ, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ పేరుతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో పర్యావరణం కాపాడుకోవడం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. ప్రస్తుతం ప్లాస్టిక్ క్యాన్సర్ కారణభూతంగా మారిందని, గతంలో మనం ఎక్కడో ఒక చోట క్యాన్సర్ అనే మాట వినేవాళ్లం.... కానీ నేడు చాలా మంది మనకు తెలిసిన వాళ్లే క్యాన్సర్ బారిన పడిన సందర్భాలు అనేకం చూస్తున్నామన్నారు. క్యాన్సర్ కు మూలమైన ప్రేళ్లు ప్లాస్టిక్ ను నిర్మూలించడం ద్వారా మన ఆరోగ్యాలను కాపాడుకోవచ్చని మంత్రి స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా మాట్లాడుతూ మన చుట్టూ పరిసరాలు, ప్రభుత్వ కార్యాలయాలు, రోడ్లు, ఆస్పత్రులు, కాల్వలు, అపరిశుభ్రంగా ఉంటే ప్రజలు ప్రభుత్వాలు, నాయకులు, అధికారుల వద్దకు వెళతారన్నారు. కానీ ఈ సమాజం మనది... మనమే ఎందుకు మన పరిసరాలను శుభ్రం చేసుకోకూడదనే ఆలోచన రావడం లేదు.. ఇది నా గ్రామం, నాది అనే మన ఆలోచనలో మార్పు రావడం ద్వారానే ప్లాస్టిక్ వంటి వాటిని ఈ సమాజం నుంచి తరిమిగొట్టగలమన్నారు. ఇలాంటి కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. బీసీ ఇందిరమ్మ చొరవ తీసుకుని ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లడం చాలా సంతోషకరం.. ప్లాస్టిక్ నివారణ, పారిశుధ్య నివారణ వంటి కార్యక్రమాలు చేపట్టడం చెప్పినంతా సులువు ఎంతమాత్రం కాదన్నారు. ఇది ప్రాక్టీకల్ గా చాలా కష్టంతో కూడుకున్నది.. సమాజంలో అందరినీ కలుపుకుని పోవాలి, అదే సమయంలో దీన్ని నిరంతరం ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేయాలన్నారు. అయితే ప్రతి ఒక్కరినీ ప్రేరేపించి, వారిలో ప్లాస్టిక్ పై అవగాహన కల్పించి వారిని చైతన్యపరచాలన్నా ఇందిరమ్మ గారి ఆలోచన చాలా గొప్పదన్నారు. ప్లాస్టిక్ వంటి వస్తువులను వాడి పారేసిన తర్వాత, వాటిని కాలిస్తే, ఆ పొగను పీల్చడం ద్వారా లంగ్ క్యాన్సర్ వంటివి వచ్చే ప్రమాదం ఉందన్నారు. ప్లాస్టిక్ ద్వారా మన ఆరోగ్యాన్ని మనమే నాశనం చేసుకుంటున్నామని చిన్నారులు ప్రదర్శించిన స్కిట్ లు ఎంతో సందేశాన్ని ఇస్తున్నాయన్నారు. ప్లాస్టిక్ ను నివారించడంతో పాటు, పచ్చదనం పెంచాలన్న గొప్ప మెసేజ్ ఇవ్వడం గొప్ప నిర్ణయం అన్నారు. బీసీ ఇందిరమ్మగారు ఒక్కరిగా ప్రారంభించిన ఉద్యమం నేడు ఇంతమందిని ప్రేరేపించింది.. మనం ఈరోజు చేస్తున్న ఈ కార్యక్రమం మన మంచి భవిష్యత్తుకు పునాది అన్నారు. మనం అంతా కలిసి పనిచేస్తే, ఈ ప్లాస్టిక్ ను తరిమివేయడం ఏమాంత పెద్ద విషయం కాదని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా మాట్లాడుతూ బనగానపల్లె పట్టణం కోసం మంచి సంకల్పం తీసుకున్నారన్నారు. ఎన్ని ఇబ్బందులు వచ్చిన వెనక్కి తిరిగి చూడకుండా ముందుకు సాగాలన్నారు. మన సమస్యలను మనమే పరిష్కరించుకోవాలి, మన పట్టణాన్ని మనమే పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎవరో వచ్చి ఏదో చేస్తారని చూస్తూ కూర్చొకుండా నేడు బీసీ ఇందిరమ్మగారు వేసి ఒక అడుగు ముందుకు వేయడం ద్వారా నేడు బనగానపల్లెలో ఈ మార్పు కనివిస్తోందన్నారు. భవిష్యత్తులో వేరే ప్రాంతం నుంచి వచ్చిన వాళ్లు ప్లాస్టిక్ ను తీసుకొస్తే మేము తీసుకోమంటూ ఖచ్చితంగా చెప్పే విధంగా మనలో మార్పు రావాలన్నారు. మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి %-% ఇందిరమ్మలు దంపతులు ఈ నిర్ణయం తీసుకోవడం చాలా అభినందనీయమన్నారు.. ఇది నిర్ణయం తీసుకున్నంత ఈజీగా మాత్రం కాదు, అమలు చేయడంలో అనేక సమస్యలుంటాయన్నారు. ఇంతటి గొప్ప నిర్ణయం తీసుకున్న మంత్రిగారికి ప్రజలంతా సహకరించాలన్నారు. ఇది మన భవిష్యత్తు కోసం.. మనం తీసుకున్న నిర్ణయమన్నారు. మన బనగానపల్లె స్ఫూర్తిగా ప్రారంభమైన ఈ ఉద్యమం భవిష్యత్తులో నంద్యాల జిల్లా... ఆంధ్రప్రదేశ్ మొత్తంగా ఆదర్శంగా తీసుకునే వరకు దీనిని ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా బీ సీ ఇందిరమ్మ మాట్లాడుతూ... నా బనగానపల్లె నా ఆరోగ్యమే లక్ష్యంగా ప్లాస్టిక్ పై అవగాహన కోసం నిర్వహించిన కార్యక్రమాల ద్వారా నేడు చాలా మంది విద్యార్థుల్లో సైతం మార్పు కనిపిస్తోందన్నారు. నేడు ఏ స్కూల్ కు వెళ్లినా విద్యార్థుల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. విద్యార్థులు.. తల్లిదండ్రులకు ప్లాస్టిక్ వినియోగించడం వల్ల వచ్చే నష్టాల గురించి అవగాహన కల్పిస్తున్న విషయాలు విన్నప్పుడు నిజంగా ఈ కార్యక్రమం విజయ వంతంమైందని భావించానన్నారు. నేడు ప్లాస్టిక్ వంటి వ్యర్థాలను తిని, ఆవులు, గేదెలు వంటి జంతువులు సైతం చనిపోయే పరిస్థితి నెలకొందన్నారు. విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగంతో క్యాన్సర్ వంటి ప్రాణాంతకమైన వ్యాధుల బారిన పడే ప్రమాదం కూడా లేకపోలేదున్నారు... గతంలో అతి స్వల్పంగా ఉన్న క్యాన్సర్ ఆస్పత్రులు, నేడు ఇంత పెద్ద ఎత్తున పెరుగుతున్నాయంటే, క్యాన్సర్ బాధితుల సంఖ్య క్రమేపీ భారీగా పెరుగుతుందని అర్థం చేసుకోవాలన్నారు. ప్లాస్టిక్ ను పూర్తిగా నిషేధించి, క్లాత్ కవర్లు, బ్యాగులు వంటివి వినియోగించాలని ఆమె సూచించారు. ప్రతి నెలా ఒక్కో ఇంట్లో 1 కేజీ ప్లాస్టిక్ వస్తుందని, ఒక్క మన బనగానపల్లెలోనే 12 వేల నుంచి 17 వేల ఇళ్లులు ఉన్నాయని.. అంటే ప్రతి నెల 5 టన్నుల ప్లాస్టిక్ మన బనగానపల్లెలో వస్తోందన్నారు.. వ్యాపారస్తులు కూడా సాధ్యమైనంత మేర ప్లాస్టిక్ ను వాడకుండా ఉండాలన్నారు.. సంక్రాంతి నుంచి బనగానపల్లెలో ప్లాస్టిక్ కనిపించకూడదనే నియమంతో మనమంతా కలిసికట్టుగా పనిచేయలన్నారు.. నేడు వ్యాపారస్తులు, షాపులు యాజమాన్యాలు సహకరిస్తున్నారన్నారు. తాజాగా బనగానపల్లెలో సహజసిద్ధంగా మొక్కజొన్న పిప్పితో తయారు చేసిన కవర్లు కూడా అందుబాటులోకి రావడం జరిగిందన్నారు. ప్రజలంతా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి సహకరించాలన్నారు.. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, కాల్వలు పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయంటూ ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదుల మేరకు ... బనగానపల్లె పట్టణాన్ని క్లీన్ చేయడానికి చుట్టు ప్రక్కల నుంచి సిబ్బందిని తీసుకువచ్చి పారిశుధ్యంగా మార్చడానికి 2 %-% 3 నెలల సమయం పట్టిందని ఆమె తెలిపారు. అయినప్పటికీ తిరిగి మళ్లీ అదే విధంగా తీసుకొచ్చి కాల్వల్లో చెత్తను వేస్తే, అవి పేరుకుపోయే పరిస్థితి వస్తోందన్నారు.. కాబట్టి మన పరిసరాలను మనం పరిశుభ్రంగా ఉంచుకుంటేనే, బనగానపల్లె పరిశుభ్రంగా మారుతుందన్నారు.







## మాస్టర్ ప్లాన్ లేకుండా రోడ్డు వెడల్పు చేస్తామనడం నియంతృత్వమే

### -కౌన్సిల్ ఆమోదం సరైంది కాదు సిపిఎం.




ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 28: వెంకటాచలం కాలనీ, దేవనగర్,శ్యాం నగర్, మూలసాగరం, సాయిబాబా నగర్, రైల్వే స్టేషన్, ఎల్ఐసి ఆఫీసు ఏరియాలలో ఉన్న 30 అడుగుల రోడ్డును 50 అడుగుల రోడ్డు మేర పెంచాలని కౌన్సిల్ ఆమోదం చేయడం దుర్మార్గమని సిపిఎం గా వ్యతిరేకిస్తున్నామని సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు కే మహమ్మద్ గౌస్, పి వెంకట లింగం లు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవనగర్, వెంకటాచలం కాలనీ,శ్యామ్ నగర్ లో నివసించే పేద ప్రజల పైన కౌన్సిల్ కర్కశంగా వ్యవహరించి వాళ్ళు నివసిస్తున్న ఇళ్లను కూల్చివేసి రోడ్లు వెడల్పు చేస్తాము, అభివృద్ధి చేస్తామని హాస్యాస్పదంగా మాట్లాడడం నియంత్రత్వానికి నిదర్శనమని, ఎలాంటి మాస్టర్ ప్లాన్ లేకుండా కౌన్సిల్లో ప్రవేశపెట్టి ఆమోదం తెలపడం దుర్మార్గమని,పేద ప్రజల ఓట్లతో ఎన్నికై ప్రజలందరికీ సేవ చేస్తాము, అన్ని సౌకర్యాల కోసం కృషి చేస్తామని చెప్పి గెలిచిన తర్వాత ప్రజలను రోడ్లకీడుస్తామని నిర్ణయం చేస్తే సిపిఎం పార్టీగా ఊరుకోబోమని, సిపిఎం పార్టీ ప్రజల కు అండగా ఉంటామని, పేద ప్రజల ఇళ్లను పడగొట్టేందుకు ఉన్న శ్రద్ధ మాస్టర్ ప్లాన్ లో ఉన్న 60 అడుగుల రోడ్డును 30 అడుగుల మేర కుదింపు చేయడం అంటే నచ్చిన వాళ్ళ కోసం ఏమైనా మార్పు చేసుకుంటాము. మాకు మెజార్టీ ఉందని నిర్ణయాలు చేసుకుంటూ వెళ్తామని అనుకుంటే పొరపాటేనని రాబోయే కాలంలో ప్రజలంతా బుద్ధి చెప్తారని, ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం దృష్టిలో ఉన్న బంగారంగాళ్ళ వీధి వెంట వెడల్పు చేయాల్సిన వాటిపైన కేంద్రీకరించాలని అలాకాకుండా పేద ప్రజలు నివసిస్తున్న ఇళ్లను కూల్చి అభివృద్ధి చేస్తామని చెప్పడం దుర్మార్గమని ఇప్పటికైనా కౌన్సిల్లో చేసిన తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలని, పేద ప్రజల ఇళ్లను కూల్చివేస్తే పేద ప్రజలకు అండగా నిలబడి పోరాటం ఉధృతం చేస్తామని అన్నారు.

## మంత్రి ఫరూక్ ను మర్యాదపూర్వకము కలిసిన కేసి కెనాల్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్



ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 28:నూతనంగా ఎన్నికైన కేసి కెనాల్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ బన్నూరు రామలింగ రెడ్డి శనివారం నాడు నంద్యాల స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ని మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో చాబోలు ఇలియాస్, తులసీశ్వర్ రెడ్డి , ఒంటెలగల భాస్కర్ రెడ్డి , కొట్టాల శివ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
ఆదివారం 29 డిసెంబర్ 2024

# టి రామన్న అండ్ సన్స్ కూరగాయల హోల్ సేల్ అండ్ రిటైల్ షాప్ ను

## ప్రారంభించిన మంత్రి ఎన్ఎండి ఫరూక్.





ఆంధ్రప్రగతి నంద్యాల డిసెంబర్ 28:
నంద్యాల పట్టణంలోని నూనెపల్లె వ్యవసాయ మార్కెట్ కమిటీ షాపులలో మార్కెట్ ప్రసాద్ , దిలీప్ కుమార్ నూతనంగా ఏర్పాటు చేసిన టి రామన్న అండ్ సన్స్ కూరగాయల హోల్ సెల్ అండ్ రిటైల్ షాపును ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించడం జరిగింది .. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యాపారంగంలో ప్రతి ఒక్కరు అభివృద్ధి చెందాలని అభివృద్ధి చెందడం ద్వారా వారి ఆర్థిక వనరులు పెరుగుతాయని అన్నారు ఈరోజు మార్కెట్ ప్రసాద్ నూతనంగా హోల్ సెల్ అండ్ రిటైల్ కూరగాయల షాపును ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని వీరు ఇలాగే దిన దినాభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సుంకన్న , బ్యాంకు తిమ్మయ్య, సాయిరాం, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# స్వయం ఉపాధి పై విద్యార్థులకు అవగాహన



ఆంధ్ర ప్రగతి దొర్నిపాడు డిసెంబర్ 28:
మండల కేంద్రమైన దొర్నిపాడు జడ్పీ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న 9 ,10 వ తరగతి విద్యార్థులు పారిశ్రామికయాత్రలో భాగంగా శనివారం బుర్ర రెడ్డి పల్లెగ్రామంలో గల మగ్గం ద్వారా వస్త్రాలు నేసేవిధానంపై విద్యార్థిలకు అవగాహన కార్యక్రమాన్ని వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ నారాయణఅవగాహన కల్పించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి విద్యతోపాటు స్వయంఉపాధి పనులను నేర్చుకుని వారి కాళ్లపైనిలబడాలని ఆయన అన్నారు మగ్గం వర్క్ నేర్చుకొనుట వలన చీరలు తోపాటు హ్యాండ్లూమ్స్ ,పంచలు, వంటివి తయారు చేసుకునే విధానాన్ని తెలుసుకోవచ్చు అన్నారు అదేవిధంగా విడిభాగాలను సచివాలయంలో చూపించి వాటిని వాడే విధానాన్ని గురించి వివరించినట్లు ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాఠశాల సిబ్బంది, చెన్నయ్య సరస్వతి, సునంద, ఒకేషనల్ ఇన్స్ట్రక్టర్ కంబగిరి రాముడు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని.



ఆంధ్ర ప్రగతి పాణ్యం డిసెంబర్ 28:
పాణ్యం నియోజకవర్గంలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల (బాలురు) పాఠశాలను తనిఖీ చేసిన కాటసాని రాంభూపాల్ రెడ్డి గారు.. అక్కడి పరిస్థితులను ప్రిన్సిపాల్ కృష్ణ నాయక్ ను అడిగి తెలుసుకున్నారు.ఔట్సోర్సింగ్ ఉపాధ్యాయులు ఉద్యోగ భద్రత కల్పియాలని కోరుతూ 45 రోజులుగా సమ్మె చేస్తున్నారు.. గిరిజన పాఠశాల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడం లేదు కూటమి ప్రభుత్వం.. దీనివలన పదవ తరగతి ఇతర తరగతులు విద్యార్థులకు బోధనలు చెప్పే ఉపాధ్యాయులు లేరు.. వచ్చే పదవ తరగతి పరీక్షల్లో ఎలా ఉత్తీర్ణులు సాధిస్తారు.. ప్రభుత్వం నిజమైన డిమాండ్లు ఉపాధ్యాయులకు పరిష్కరించి విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చేయాలని కోరారు. ప్రస్తుతం బాలుర పాఠశాలకు ఇద్దరు వాలంటీర్లను ఏర్పాటు గ్రీన్ కో వాళ్లతో మాట్లాడి కృషి చేస్తా అని నంద్యాల జిల్లా అధ్యక్షులు మరియు పాణ్యం మాజీ ఎమ్మెల్యే శ్రీ కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు.

# తెలంగాణ నేతల సిఫార్సులకు నో

## ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్న ఇవో



తిరుమల,డిసెంబర్28ఆంధ్ర ప్రగతి
తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను స్వీకరిస్తున్నట్లు పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. తెలంగాణ లీడర్ల విజ్ఞప్తి మేరకు సానుకూలంగా స్పందించి వారంలో రెండు రోజులు సిఫారసు లేఖలు స్వీకరించేందుకు టీటీడీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు వార్తలు గుప్పుమన్నాయి. ఈ క్రమంలో తెలంగాణ రాజకీయ నాయకుల సిఫారసు లేఖల స్వీకరణపై టీటీడీ ఈవో శ్యామల రావు కుండబద్దలు కొట్టారు. తెలంగాణ ప్రజా ప్రతినిధుల సిఫారసు లేఖలు స్వీకరిస్తున్నట్లు జరుగుతోన్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను స్వీకరిస్తున్నట్లు వస్తున్న వార్తలు నిజం కాదని తెలిపారు. మీడియాలో అలా ప్రచారం జరుగుతోందని.. కానీ తెలంగాణ ప్రజా ప్రతినిధుల సిఫారసు లేఖల స్వీకరణపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఈవో శ్యామల రావు వివరణ ఇచ్చారు. ప్రముఖ పుణ్యక్షేత్రం తిరుమలలో తెలంగాణ లీడర్ల సిఫారసు లేఖలు స్వీకరించకపోవడంపై రాష్ట్రానికి చెందిన ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ టీటీడీ తీరును బహిరంగంగానే తప్పుబట్టారు. తెలంగాణ ప్రజా ప్రతినిధుల సిఫారసు లేఖలు స్వీకరించాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలోనే తెలంగాణ లీడర్ల సిఫారసు లేఖలు స్వీకరించేందుకు టీటీడీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని.. వారంలో రెండు రోజులు సిఫారసు లేఖలపై దర్శనానికి అవకాశం కల్పించినట్లు మీడియాలో పెద్ద ఎత్తున కథనాలు వెలువడ్డాయి. దీంతో అప్రమత్తమైన టీటీడీ ఈవో శ్యామల రావు.. తెలంగాణ ప్రజా ప్రతినిధుల సిఫారసు లేఖల స్వీకరణపై క్లారిటీ ఇచ్చారు. తెలంగాణ లీడర్ల లేఖలపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశారు.

# బండి ఆత్మకూరు మండలంలో భారీగా రేషన్ దందా..!

-మండలంలోని పలు గ్రామాల్లో భారీగా స్టాక్ పాయింట్లు.
-ఒక ప్రముఖ శాఖకు లక్షల్లో మామూలు అందుతున్న వైనం.
-చోద్యం చూస్తున్న సివిల్ సప్లై అధికారులు.



ఆంధ్ర ప్రగతి
బండి ఆత్మకూరు డిసెంబర్ 28:
రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు రేషన్ మాఫియా చేస్తే శిక్షలు తప్పవు అని హెచ్చరించిన బండి ఆత్మకూరు మండలంలో మాత్రం రేషన్ మాఫియా మాకు అవి ఏమీ పట్టవున్నట్లుగా ఇస్తారాజ్యంగా రాజ్యమేలుతుంది. బండి ఆత్మకూరు మండలంలోని అన్ని గ్రామాల్లో రేషన్ మాఫియా ఏజెంట్లను నియమించి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేయిస్తున్నారు. పట్టపగులే కొనుగోలు చేస్తూ ఆటోలలో తరలిస్తున్నారు. రేషన్ మాఫియా పై ప్రభుత్వం ఉక్కుపాదం మోపి శిక్షలు ఖరారు చేసింది. అయినా కూడా బండి ఆత్మకూరు మండలంలో ఆగని రేషన్ మాఫియా దందా. బండి ఆత్మకూరు మండలంలోని ప్రముఖంగా రేషన్ మాఫియాఒక ప్రముఖ శాఖకు లక్షల్లో నెల మామూలు ఇస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. అంతేకాకుండా ఆ ప్రముఖ శాఖకు చెందిన అధికారి చెప్పిన వారికి బియ్యం అమ్మాలంటూ ఆదేశాలు జారీ చేశారు. బహిరంగంగా గ్రామాల్లో ఏజెంట్లు కూడా మాకు అధికారి చెప్పిన వారికే బియ్యం అమ్ముతున్నట్లు చెబుతున్నారు. ఇదంతా బండి ఆత్మకూరు మండలంలో జరుగుతున్న సివిల్ సప్లై అధికారులు మాత్రం పట్టించుకోకపోవడం పై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రేషన్ మాఫియాకు అధికారుల అండదండలు పుష్కలంగా ఉండడంతోనే బండి ఆత్మకూరు మండలంలో ఏదేచ్ఛగా రేషన్ దందా కొనసాగుతుంది. ముఖ్యంగా బండి ఆత్మకూరు మండలంలోని కొన్ని గ్రామాల్లో భారీగా స్టాక్ పాయింట్లు ఏర్పాటు కూడా చేశారు. నెలలో సేకరించిన బియ్యాన్ని15 రోజులకు ఒకసారి లారీల్లో రాష్ట్రాన్ని దాటిస్తున్న వైనం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రేషన్ మాఫియాకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు. రేషన్ మాఫియాకు అడ్డుకట్ట వేస్తారా... లేక మామూళ్లతోనే సరి పెడతారా వేచి చూడాల్సిందే.

# పర్యాటకరంగ అభివృద్ధికి కృషి చేయండి.

**-జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా**



ఆంధ్ర ప్రగతి నంద్యాల, డిసెంబర్ 28:
జిల్లాలో పర్యాటకరంగ అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ ఛాంబర్ లో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పర్యాటక మండలి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. జిల్లా టూరిజం అధికారి సత్యనారాయణమూర్తి, ఏపీటీడీసీ డివియం చంద్రమౌళి, డిఈ కుమార్, ఇరిగేషన్ ఎస్ఈ సుబ్బరాయుడు, జిల్లా ఫారెస్ట్ అధికారి నాగమునేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడంతో పాటు కొత్తగా సంత జూటూరును టూరిజం సర్క్యూట్ గా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని టూరిజం అధికారులను ఆదేశించారు. సంత జూటూరు నుండి ఓంకారం, వైయస్సార్ స్మృతి వనం, నంద్యాల జిల్లాను కలుపుతూ టూరిజం సర్క్యూట్ గా ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. అవుకు బోటింగ్, రెస్టారెంట్ నిర్వహణకు టెండర్లు పిలిచి ఖరారు చేయాలన్నారు. నంద్యాల పట్టణంలోని చిన్న చెరువు పాత బకాయిల వసూళ్లకు చివరిసారిగా నోటీసులు ఇచ్చి చట్టపరంగా తదుపరి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రిజర్వాయర్లు, చెరువులలో బోట్లలో ప్రయాణానికి సంబంధించి తొమ్మిది రకాల అనుమతులు తీసుకోవాలని సంబంధిత అంశాలను పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. సిద్దేశ్వరం నుండి సోమశిల సింగోటం జాతరకు బోట్లలో వెళ్తున్నారని అనుమతులు లేని బోట్లలో ప్రయాణం చేస్తే ప్రమాదాలకు గురయ్యే అవకాశం వుందని సంబంధిత నిర్వాహకులను హెచ్చరించాలన్నారు. బిల స్వర్గం, వాల్మీకి గుహలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని కలెక్టర్ ఏపీ టీడీసిఅధికారులు ఆదేశించారు. ప్రతి టూరిజం ప్రదేశాలలో గిరిజనుల ఉత్పత్తుల దుకాణాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఫారెస్ట్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని ఏడు టూరిజం సర్క్యూట్ డెస్టినేషన్ లను వెబ్సైట్లో ఏపీటీడీసీ లింకుతో అనుసంధానం చేయాలన్నారు. గండికోట, అహోబిలం, ఓర్వకల్ ఎయిర్పోర్ట్ లో టూరిజం సర్క్యూట్ డిస్ప్లే బోర్డుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు.

# సంస్కరణ యోధునికి చిత్ర నివాళి..

భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ కు చిత్ర రూపంలో
నివాళులర్పించిన కర్నూలు నగరానికి చెందిన చిత్రకారుడు పెరుమాళ్ళ వాసు..



ఆంధ్ర ప్రగతి (కర్నూలు):డిసెంబర్ 28:
భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి బాధాకరమని,ఆయన లేని లోటు తీర్చలేనిది అని,భారత దేశ ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేయడంలో పదేళ్ల పాటు ఆయన చేసిన కృషి దేశం గర్వించదగినదని కర్నూలు నగరానికి చెందిన చిత్రకారుడు పెరుమాళ్ళ వాసు అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,నిగర్వి, మౌనముని గా పేరొందిన మన్మోహన్ మృతి యావత్ భారత దేశం జీర్ణించుకోలేక పోయింది.దేశంలో ఒక తరానికి ఆయన అందించిన అభివృద్ధి ఫలాలు మరువలేనివి. దేశం గర్వించదగ్గ ప్రధానుల్లో మన్మోహన్ సింగ్ ప్రథమంగా వుంటారు.ఒక చిత్రకారునిగా నా కౌమార్య దశ నుంచి నాకు ప్రధాని అంటే మన్మోహన్ సింగ్ అనే గుర్తు...ఆయన వల్లే ప్రతీ రంగం మరీ ముఖ్యంగా కళారంగం చాలా అభివృద్ధి సాధించింది.సోనియాగాంధీ నిర్దేశత్వం లో మన్మోహన్ సింగ్ దేశ ప్రజలలో చెరగని ముద్ర వేశారు.ఆయన మృతికి ఒక చిత్రలేఖన కళాకారుడిగా ఆయనకు ఇదే సరైన నివాళి అని పేర్కొన్నారు.



# మత్స్యకారులకు జీవనోపాధి కల్పించేందుకు చర్యలు

## నదీతీర ప్రాంతాల్లో చేపపిల్లల పెంపకం - కృష్ణానదిలో చేపపిల్లలు వదిలిన సుజనాచౌదరి

విజయవాడ,డిసెంబర్28ఆంధ్ర ప్రగతి
అంతరించిపోతున్న మత్స్య సంపదను తిరిగి పెంచటంతో పాటు మత్స్యకారులకు జీవనోపాధి కల్పించేందుకు నదీ తీరప్రాంతాలలో చేప పిల్లలను విడుదలచేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ, శాసన సభ్యులు యలమంచిలి సత్యన్నారాయణ (సుజనా చౌదరి) లు తెలిపారు. జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో స్థానిక భవానీపురం సమీపంలో గల భవానీ ఘాట్ వద్ద శనివారం జిల్లా కలెక్టర్ జి. లక్ష్మీశ, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు యలమంచిలి సత్యన్నారాయణ (సుజనా చౌదరి) కృష్ణనదిలో చేప పిల్లలను విడుదల చేసారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమంతో పాటు మత్స్యసంపదను పెంచటానికి రాష్ట్రప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. ఇందులో భాగంగా కృష్ణనది పరివాహక ప్రాంతంలో చేప పిల్లలను విడుదల చేయడం జరుగుతుందని ఏడు నెలల అనంతరం మత్స్యకారులు ఉచితంగా చేపలను వేటాడి వాటిని విక్రయించుకొని ఆర్థిక ప్రయోజనం పొందాలన్నదే ఈ కార్యక్రమ ఉద్దేశమన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ప్రయోజనాలను మత్స్యకారులు సద్వినియోగం చేసుకొని ఆర్థిక పురోగతి సాధించాలని కలెక్టర్ కోరారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు యలమంచిలి సుజనా చౌదరి మాట్లాడుతూ మత్స్యకారులకు ఆర్థిక ప్రయోజనాలు చేకూర్చేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పలు కార్యక్రమాలను అమలుచేస్తుందన్నారు. ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన పథకం ద్వారా మత్స్యకారులకు నాలుగు చక్రాలు, మూడు చక్రాలు, ద్వి చక్ర వాహనాలను సబ్సిడీ పై అందజేస్తున్నట్లు తెలిపారు. వేటకు వెళ్లే మత్స్యకారులకు లైసెన్స్ లు మంజూరుచేయడం జరుగుతుందని 50 సంవత్సరాలు పైబడిన మత్స్యకారులకు పెన్షన్ సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు.

# తెలుగు భాషను కాపాడుకుందాం

## ఆత్మాభిమానాన్ని పెంచుకుందాం - తెలుగు భాష ఔన్నత్యం కోసం కృషి చేద్దాం

## భాషా,సంస్కృతులను పరిరక్షించుకోవాల్సిందే - ప్రపంచ తెలుగు రచయితల మహాసభలో జస్టిస్ ఎన్వీరమణ పిలుపు

విజయవాడ,డిసెంబర్28ఆంధ్ర ప్రగతి:

'తెలుగు భాషను కాపాడుకుందాం. ఆత్మాభిమానాన్ని పెంచుకుందాం అనే నినాదంతో ఐక్యత చాటేందుకు నలుమూలల నుంచి విజయవాడకు తరలివచ్చిన వారందరికీ వందనాలు' అని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. విజయవాడలో జరుగుతున్న ప్రపంచ తెలుగు రచయితల ఆరో మహాసభల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు.'తెలుగు భాషా, సంస్కృతిని పరిరక్షించుకున్నప్పుడే మనం గొప్పవారమవుతాం. జాతి మనుగడకు, వికాసానికి ధైర్యం కావాలి. భాష లేకపోతే.. ఎన్ని ఉన్నా చరిత్ర లేని అనాథలం, అక్షరం లేని అభాగ్యులం అవుతామన్నారు. విశ్వవ్యాప్తంగా ఉన్న తెలుగువారు మన సంస్కృతి, భాషను మరిచిపోకూడదని.. తెలుగు జాతి కీర్తి ప్రతిష్ఠలు నిత్యం వెలుగొందాలని కోరుకునే వ్యక్తిని నేను. తెలుగు భాషను దేశంలో వంద మిలియన్లకు పైగా మాట్లాడతారు. తెలుగుభాష పలుకుబడి వినసొంపైనది. అది సంగీతంలా ఉంటుంది.

సామాన్య ప్రజలు కూడా కవితా ధోరణిలో మాట్లాడగలిగే అందమైన భాష తెలుగు. ఇంత అద్భుతమైన మన తల్లి భాష తెలుగును.. వ్యాపార, రాజకీయ ప్రయోజనాల కోసం వేరే భాష, సంస్కృతి వచ్చి కొల్లగొట్టడాన్ని మనం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించరాదన్నారు. మన సంస్కృతి, భాష చిరకాలం నిలిచి ఉండేలా.. శ్రీశ్రీ, ఆరుద్ర, విశ్వనాథ సత్యనారాయణ, సినారెలాంటి గొప్ప కవులు, రచయితలు.. భానుమతి, సూర్యకాంతం, జమున, సావిత్రి, గుమ్మడి, జగ్గయ్య, అక్కినేని, ఎన్టీఆర్, రేలంగి, ఎస్వీఆర్, ఘంటసాల, మంగళంపల్లి బాలమురళీకృష్ణ, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఇలా ఎందరెందరో దిగ్గజాల ఘనమైన వారసత్వం మనది. ఈ వారసత్వం మరవకండి. మీరు గుర్తుంచుకోండి.. మీ పిల్లలకు గుర్తు చేయండి. 'భాష అనేది భావ వ్యక్తీకరణకు ఒక సాధనం. ప్రస్తుత కర్తవ్యం అభివృద్ధితోపాటు.. భాషా సంస్కృతులను మనం రక్షించుకోవాలన్నారు. 'ఎన్టీఆర్ వల్ల తెలుగు భాషకు.. ప్రజలకు గౌరవం పెరిగింది. ప్రభుత్వ అవార్డులకన్నా.. సమాజాన్ని మేల్కొలిపే రచనలే మిన్న. తెలుగును పరిపుష్టం చేసేలా ప్రభుత్వాలు ఆలోచించాలి. పత్రికలు, ఛానళ్లు తెలుగు అభివృద్ధికి పాటుపడాలి. తమిళనాడు తరహాలో మన పాలకులూ భాషాభివృద్ధికి కృషి చేయాలి. తెలుగుకు మద్దతిచ్చేవారికే ఓటు అని ప్రజలతో చెప్పించాలి. అలా చెప్పిస్తేనే.. మాతృభాష అభివృద్ధి, వైభవం దక్కుతుంది' అని జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. 'తెలుగు తల్లి ముద్దుబిడ్డ, మహోన్నత వ్యక్తి, తుది శ్వాస వరకూ తెలుగు భాష, సంప్రదాయాల పరిరక్షణ కోసం పోరాడిన యోధుడు రామోజీరావు సభా వేదిక నుంచి మిమ్మల్నందర్నీ చూస్తుంటే.. యావత్ తెలుగు ప్రపంచం నా ముందు సాక్షాత్కరిస్తోందని అన్నారు. తెలుగు భాష కీర్తి పతాకను ఎగుర వేసేలా సభలు నిర్వహిస్తున్న అందరికీ తెలుగు బిడ్డగా కృతజ్ఞతలు తెలియజేశారు. తెలుగు సాహిత్యం, వైభవం గురించి అనర్గళంగా ఇక్కడ మాట్లాడారన్నారు. తెలుగు జాతి అంటే మదరాసీలు కాదని తెలుగు రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు ప్రాణాలు విడిచారన్నారు. పురాణాలు, ఇతిహాసాలు దాటి ప్రజల భాషగా తెలుగు భాష మారిందన్నారు. ఒక సంగీతం తరహాలో అందమైన భాష తెలుగు భాష అని కొనియాడారు. వ్యాపార, రాజకీయ



ప్రయోజనాలతో తెలుగు భాషను అణగదొక్కారని విమర్శించారు. తగినంత గుర్తింపు కూడా భాషకు దక్కలేదన్నారు. వాడుక భాషలో మనం ఇంకా ప్రజలకు దగ్గర కాలేదని.. తెలుగు భాష వృద్ధిపై మన ప్రభుత్వాలు దృష్టి పెట్టింది లేదన్నారు. కొన్ని దేశాల్లో వారి మాతృభాషలో విద్యాబోధన చేసి అద్భుతాలు సాధించారని వెల్లడించారు. వారి సాంకేతికతను, విజయాలను వారి భాషలోనే రాసుకున్నాయన్నారు. భవిష్యత్తుతరాలకు మాతృభాషపై ఒక గౌరవం కలిగించాయన్నారు. ఆ తరహాలో మన తెలుగు భాషకు ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. 'పర భాషను నేర్చుకోండి... వ్యామోహం పెంచుకోకండి. నా సంస్కృతి నాశనం కాకుండా చూడాలని గాంధీజీ చెప్పేవారు. మాతృభాషలో విద్యను అభ్యసించి చాలా మంది ఉన్నత స్థితికి చేరారు. పెట్టుబడిదారులు ఇంగ్లీషు భాష ఉంటేనే ఉద్యోగాలు అనే పరిస్థితి కల్పించారు. తెలుగు భాషలోచదివి... దేశ విదేశాల్లో రాణిస్తున్న వారు ఎందరో. ప్రజా బాహుళ్యంలో మాతృభాషలోనే అన్ని నిర్ణయాలు ఉండాలి. ప్రభుత్వాలు కూడా తెలుగు భాషలోనే ఆదేశాల కాపీలు ఇచ్చే ఆలోచన చేయాలి. తెలుగు భాష వైభవం వల్లే తెలుగు రాష్ట్రాలకు కీర్తి ఉంటుంది. మన ఆచార, వ్యవహారాలు సక్రమంగా అమలు చేయాలి. అభివృద్ధితో పాటు భాషా సంస్కృతిని అలవాటు చేసుకోవాలి' అని జస్టిస్ ఎన్వీ రమణ వెల్లడించారు. మాతృభాషపై మమకారం ఉన్న వారి వల్లే మన భాషకు గౌరవం దక్కుతుందన్నారు. ఎన్టీఆర్ వంటి వారి వల్ల మన భాషకు, మన తెలుగు వాళ్లకు గౌరవం పెరిగిందన్నారు. మానవ బంధాలతో కూడిన రచనలే కలకాలం ప్రజల్లో నిలుస్తాయని.. కన్యాశుల్కం వంటి రచనలే ఇందుకు ఉదాహరణ అని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చే

అవార్డులు కన్నా... సమాజాన్ని మేల్కొలిపే రచనలే మిన్న అని తెలిపారు. తెలుగు భాషను పరిపుష్టం చేయాలనే ఆలోచనపై ప్రభుత్వం సానుకులంగా స్పందించాలని కోరారు. పత్రికలు, టీవీ ఛానళ్లు కూడా తెలుగు భాష అభివృద్ధి కోసం పాటుపడాలని.. లేదంటే భవిష్యత్తులో తెలుగు పేపర్లు, ఛానళ్లు చూసే పరిస్థితి ఉండదన్నారు. 'తమిళనాడులో అక్కడ భాషాభివృద్ధికి ఎన్నో చర్యలు తీసుకుంటున్నారని.. ఆ తరహాలో మన దగ్గర పాలకులు స్పందించడం లేదు. అక్కడ ఉన్న ఐక్యత, మన దగ్గర లేదనేది వాస్తవం. కవులు, భాషాభిమానులను చూసి ప్రభుత్వాలు భయపడవు. ప్రజలను కూడా తెలుగు భాషోద్యమంలో భాగస్వామ్యం చేయాలి. ప్రజల మద్దతుతో మన ప్రభుత్వం ఏర్పడుతుంది. తెలుగు భాషకు మద్దతు ఇచ్చేవారికే ఓటు అని ప్రజలతో చెప్పించండి. అప్పుడే మన భాష అభివృద్ధి, వైభవం తప్పకుండా సాకారం అవుతుందని ఎన్వీ రమణ పేర్కొన్నారు.కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వం భాష అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఏపీలో ఏర్పాటు చేయాలని కోరారు. గత ప్రభుత్వం తెలుగు భాషను అణచివేసేలా ఇచ్చిన జివో 85ను రద్దు చేయాలన్నారు. సుప్రీంకోర్టులో ఉన్న ఈ కేసుపై దృష్టి పెట్టాలన్నారు. తెలుగు భాష ప్రాధికారిక సంస్థను మళ్లీ పునరుద్ధరించాలన్నారు. 2019 కి ముందు చంద్రబాబు ఏర్పాటు చేసినా.. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. ఈ మహాసభల ద్వారా కవులు, రచయితలకు ప్రోత్సాహం అందించాలని.. వారికి భాషాభివృద్ధి కోసం పని చేసేలా ప్రోత్సహించాలన్నారు. 'తెలుగువారి శక్తి... తెలుగువాడి నాడి వ్యాపించాలి.. నేను కోరుకునేది అదేనంటూ ముగించారు.

---



# 2024 జనసేనానిదే

### తిరుగులేని నేతగా జనసేనాని
### 2024 ఎన్నికలతో సమర్థనాయకుడిగా అవతరణ
### సమస్యల పరిష్కరంలో చొరవతో ప్రజలకు చేరువ
### అద్భుత విజయంతో ప్రజానాయకుడిగా పవన్



అమరావతి,డిసెంబర్28ఆంధ్ర ప్రగతి:

ఈ యేడాది ఎన్నికల్లో అసలుసిసలు హీరోగా పవన్ కళ్యాణ్ అవతరించయారు. గత ఎన్నికల్లో ఒక్కటంటే ఒక్కసీటు గెలిచిన జనసేన..ఈ యేడాది సార్వత్రిక ఎన్నికల్లో విజృంభించింది. దీంతో పవన్ కళ్యాణ్ తిరుగులేని నేతగా ఎదిగారు. ఓ రకంగా చెప్పాలంటే ఎపిలో బలమైన నేతగా పవన్ అవతరించారు. అలాగే ఆయన డిప్యూటి సిఎంగా ప్రజాసమస్యలపై స్పందిస్తూనే, పరిష్కిరం కోసం చేస్తున్న కృషి ప్రజల్లో నిజమైన నేతగా నిలుపుతోంది. తిరుమల లడ్డూ వ్యవహారంతో హిందువుల్లో బలమైన ప్రశ్నించే నేతగా ఎదిగారు. దీంతో దేశ ప్రజల దృష్టిని కూడా పవన్ కళ్యాణ్ ఆకర్షించారు. పవన్ కళ్యాణ్ మాత్రం సనాతన ధర్మాన్ని రక్షించుకోవల్సిన అవసరం ఉందని, తమ పార్టీ సనాతన ధర్మ పరిరక్షణకు కృషిచేస్తుందని బహిరంగంగా ప్రకటించడంతో పాటు తిరుపతిలో ఓ సభ ఏర్పాటుచేసి డిక్లరేషన్ ప్రకటించారు. దీంతో ఏపీలో సనాతన ధర్మ పరిరక్షణ బ్రాండ్ అంబాసిడర్‌గా పవన్ కళ్యాణ్ గుర్తింపు పొందారు. ఇతర మతాలను గౌరవిస్తూనే సనాతన ధర్మాన్ని పరిరక్షించుకోవల్సిన అవసరాన్ని ధైర్యంగా చెప్పారు. దేశ స్థాయిలో సనాతన ధర్మ పరిరక్షణకు అవసరమైతే తాను నాయకత్వం వహిస్తాననే రీతిలో సందేశం ఇచ్చారు. 2024 సంవత్సరం పవన్‌కు లక్కీ ఇయర్‌గా చెప్పుకోవచ్చు. 2014లో పార్టీ పెట్టినప్పటి నుంచి 2023 వరకు పవన్ కళ్యాణ్ రాజకీయంగా ఎలాంటి విజయాలను చూడలేదు. కానీ 2024లో తాను ఊహించదానికంటే ఎక్కువ విజయాలను అందుకున్నారు. తనతో పాటు జనసేన పార్టీకి 2014 కలిసొచ్చిందనే చెప్పుకోవాలి.మహారాష్ట్ర ఎన్నికలు దేశం దృష్టిని ఆకర్షించాయి. ఇండియా (మహా వికాస్ అఘాడీ), ఎన్డియే(మహాయుతి) కూటమి మధ్య హోరాహోరీ పోరు నడిచింది. సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా కూటమి ఎక్కువ లోక్‌సభ స్థానాలు గెలుచుకోవడంతో శాసనసభ ఎన్నికల్లో ఎవరు గెలుస్తారనే ఉత్కంఠ నెలకొంది. రెండు కూటములు అధికారంపై ధీమా వ్యక్తం చేశాయి. చివరకు ఎన్డియే కూటమి భారీ విజయం సాధించింది. ముఖ్యంగా గతంలో తెలుగు ఓటర్లు ఎక్కువుగా ఉండే నియోజకవర్గాల్లో కాంగ్రెస్ లేదా ఆ పార్టీ మద్దతు దారులు ఎక్కువుగా గెలుపొందేవారు. ఈసారి పవన్ కళ్యాణ్ తెలుగు ఓటర్లు ఎక్కువ ప్రభావం చూపించే నియోజకవర్గాల్లో మహాయుతి కూటమి అభ్యర్థుల తరపున ప్రచారం నిర్వహించారు. పవన్ కళ్యాణ్ ప్రచారం చేసిన అన్ని నియోజకవర్గాల్లో మహాయుతి కూటమి మంచి ప్రదర్శన కనబర్చింది. దీంతో పవన్ కళ్యాణ్ ఇమేజ్ తెలుగు రాష్ట్రాలను దాటి జాతీయస్థాయికి వెళ్లింది. బిజెపిలో కూడా పవన్ కళ్యాణ్ పట్ల కొంత ఆరాధ్యభావం పెరిగింది. మరోవైపు ఎన్డియే సమావేశాల్లో పవన్ కళ్యాణ్‌ను ప్రధాని మోదీ ప్రశంసలతో ముంచెత్తడం ఆయన ఇమేజ్‌ను దేశ స్థాయిలో మరింత పెంచింది. మొన్నిటి సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసిన 21 శాసనసభ, రెండు పార్లమెంట్ స్థానాల్లో గెలుపొంది జనసేన వంద శాతం విజయం సాధించింది. ఈ ఎన్నికల తర్వాత జనసేన పార్టీ ఉండదని, పవన్ కళ్యాణ్ రాజకీయాలకు పనికిరారంటూ ఎంతోమంది ఎన్నో విమర్శలు చేసినా ఆయన పట్టించుకోలేదు. మాజీ సిఎం జగన్ అయితే పవన్ కళ్యాణ్ పెళ్లిళ్లపై ఎకసక్కాలు ఆడారు. వరుస విమర్శలు చేశారు. కానీ అవన్నీ వైసిపికే తగిలి ఆ పార్టీ మట్టికొట్టుకు పోయింది. గత దశాబ్ద కాలంలో రాజకీయంగా పవన్ బాగా పరిణతి చెందారు. ఏవిధమైన వ్యూహాలతో ముందుకెళ్లాలో సరిగ్గా అంచనా వేసుకోగలిగారు. అప్పటి అధికారపక్షం వైసీపీ ఎన్ని ఇబ్బందులు పెట్టినా, వ్యక్తిగతంగా టార్గెట్ చేసినా వెనక్కి తగ్గలేదు.. ప్రతి విమర్శకు ధీటైన జవాబుఇస్తూ ముందుకుసాగారు. వారాహి యాత్రతో ప్రజలతో మమేకమయ్యారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలనివ్వబోనన్న మాటపై చివరివరకు నిలబడుతూ.. బీజేపీ, టీడీపీ, జనసేన మధ్య పొత్తు కుదరడంతో పవన్ కళ్యాణ్ కీలకపాత్ర పోషించారు. జనసేనకు సీట్ల కేటాయింపుపై ఎన్నో రకాల విమర్శలు వచ్చినా.. తాను పోటీచేసే అన్ని స్థానాల్లో గెలిచి సత్తా చాటడమే తన ముందున్న కర్తవ్యమంటూ ముందుకెళ్లారు. చివరకు పోటీచేసిన అన్ని స్థానాల్లో గెలిచి చరిత్ర సృష్టించారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికల ముందు వరకు జనసేన ఓ రాజకీయపార్టీ.. ఎన్నికల తర్వాత ఆపార్టీ ఓ శక్తిగా మారింది. పవర్ ఉంటే ఏదైనా చేయ్యేచ్చు.. జనసేన లక్ష్యం చేరుకోవాలంటే పవర్ కావాలంటూ పవన్ కళ్యాణ్ పదేపదే వ్యాఖ్యానించే వారు. ఎన్నికల తర్వాత ఏపీ ప్రభుత్వంలో జనసేన భాగస్వామిగా ఉంది. పవన్ కళ్యాణ్ ఉప ముఖ్యమంత్రి బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను పవన్ కళ్యాణ్ మర్చిపోలేదు. అధికారంలో ఉన్నా.. లేకపోయినా తాను ప్రజాసేవకుడినేనంటూ ముందుకు సాగారు. ప్రభుత్వ పరంగా తీసుకునే నిర్ణయాల్లో ఎక్కడా తొందరపాటు చూపించకుండా.. నిదానంగా ముందుకెళ్తూ.. అందుబాటులో ఉన్న వనరులతో ఏ విధంగా అభివృద్ధి చేయగలమో ప్రణాళికలు రచించుకుంటూ ముందుకెళ్తున్నారు. తనకు ఇష్టమైన గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖల బాధ్యతలను నిర్వర్తిస్తూ.. రాష్ట్రంలో తనదైన మార్క్ పాలనను ప్రజలకు చూపించేందుకు పవన్ కళ్యాణ్ ప్రయత్నిస్తున్నారు.





# శతక్కొట్టిన నితీశ్‌కుమార్ రెడ్డి

## మెల్‌బోర్న్ టెస్ట్‌లో రికార్డు శతకం



మెల్‌బోర్న్,డిసెంబర్28ఆంధ్ర ప్రగతి:
తెలుగు కుర్రాడు నితీశ్‌కుమార్ రెడ్డి ఆస్ట్రేలియా పర్యటనలో అదరగొట్టాడు. పేస్ ఆల్‌రౌండర్‌గా జట్టులోకి వచ్చిన అతడు మెల్‌బోర్న్ టెస్టులో జట్టును ఫాల్ ఆన్ గండం నుంచి బయటపడేశాడు. ఈక్రమంలో టెస్టు కెరీర్‌లో 171 బంతుల్లో తొలి శతకం సాధించాడు. ఎనిమిదో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన నితీశ్ తొలి బంతి నుంచి నిలకడైన ఆటతీరును ప్రదర్శించాడు. ప్రత్యర్థి బౌలర్లకు ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. ఆస్ట్రేలియా గడ్డపై 8వ స్థానంలో వచ్చి అత్యధిక పరుగులు చేసిన భారత బ్యాటర్‌గా నిలిచాడు. ఇంతకుముందు స్పిన్ దిగ్గజం అనిల్ కుంబ్లే (87) పేరిట ఈ రికార్డు ఉండేది. ఇప్పుడు దానిని అధిగమించాడు. సుందర్‌తో కలిసి భారత ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించిన నితీశ్ సెంచరీ సమయంలో టెన్షన్ వాతావరణం నెలకొంది. స్వల్ప వ్యవధిలో రెండు వికెట్లను భారత్ కోల్పోయింది. చివరి వికెట్‌గా సిరాజ్ మాత్రమే ఉన్నాడు. అప్పుడు నాన్‌స్ట్రైకింగ్ ఎండ్‌లో నితీశ్ 99 పరుగుల మీద ఉండటం.. కమిన్స్, బోలాండ్ కట్టుదిట్టంగా బంతులేయడంతో అభిమానుల్లో ఆందోళన రేగింది. అయితే, సిరాజ్ చక్కటి డిఫెన్స్‌తో ఆడి నితీశ్‌కు స్ట్రైకింగ్ ఇచ్చాడు. బోలాండ్ బౌలింగ్‌లో బౌండరీతో సెంచరీని పూర్తి చేశాడు. దీంతో ప్రేక్షకుల్లో ఉన్న నితీశ్ తండ్రి ముత్యాలరెడ్డిని అభినందిస్తూ ఫ్యాన్స్ సంబరాలు చేసుకున్నారు. నితీశ్‌తోపాటు సుందర్ (50) కూడా కీలక ఇన్నింగ్స్ ఆడాడు. తొమ్మిదో స్థానంలో వచ్చిన అతడు హాఫ్ సెంచరీ సాధించాడు. క్రీజ్‌లో పాతుకుపోయిన సుందర్ 146 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేశాడు. అతడి కెరీర్‌లో ఇది నాలుగో హాఫ్ సెంచరీ. సెంచరీ హీరో నితీశ్‌తో కలిసి ఎనిమిదో వికెట్‌కు శతకం (127 పరుగులు) భాగస్వామ్యం నిర్మించాడు. నాథన్ లైయన్ బౌలింగ్‌లో స్లిప్‌లో క్యాచ్ ఇచ్చి 8వ వికెట్ రూపంలో పెవిలియన్‌కు చేరాడు. నితీశ్ సెంచరీ పూర్తయ్యాక బ్యాడ్‌లైటింగ్ కారణంగా ఆట నిలిచిపోయింది. అప్పటికి భారత్ స్కోరు 358/9. క్రీజ్‌లో నితీశ్ (105?), సిరాజ్ (2) ఉన్నారు. ఇంకా భారత్ 116 పరుగులు వెనకబడి ఉంది. అయితే, వర్షం వచ్చేయడంతో పిచ్‌ను కవర్లతో సిబ్బంది కప్పేశారు. ఎంతకీ తగ్గకపోవడంతో ఆటను నిలిపేస్తున్నట్లు అంపైర్లు ప్రకటించారు. దీంతో మూడో రోజు ఆట ముగిసింది. ఇవాళ భారత్ నాలుగు వికెట్లను కోల్పోయి 193 పరుగులు రాబట్టింది. తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ 474 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.

## బొకేల బదులు..పుస్తకాలు ఇవ్వండి

### బుక్ఫెయిర్ సందర్శించిన గవర్నర్



హైదరాబాద్,డిసెంబర్28ఆంధ్ర ప్రగతి: శుభకార్యాలకు వెళ్లినప్పుడు బొకేలకు బదులుగా పుస్తకాలు ఇవ్వాలని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సూచించారు. శనివారం ఆయన హైదరాబాద్ బుక్ ఫెయిర్‌ను సందర్శించి మాట్లాడారు. 'పుస్తకాల్లో అనంతమైన జ్ఞానం ఉంది. నిరక్షరాస్యుల కోసం ఆడియో బుక్స్ కూడా అందుబాటులోకి వచ్చాయి. పుస్తకాలను నమిలి మింగేయాలనేంత క్షుణ్ణంగా చదవాలి. హైదరాబాద్ బుక్ ఫెయిర్ సంప్రదాయబద్ధంగా పుస్తకాల్ని ప్రమోట్ చేస్తోంది. మానవ నాగరికత వర్ధిల్లినంతకాలం పుస్తకాలు ఉంటాయి. ఈ-బుక్స్ కంటే పుస్తకాల్లోనే మజా ఉంటుంది. రచయితతో డైరెక్ట్‌గా మాట్లాడుతున్నట్టు ఉంటుంది. విశ్వం గురించి తెలియాలంటే పుస్తకాలు చదవాల్సిందే. ఈ-పుస్తకాలు చదివితే ఆ ఫీల్ ఉండదని పలువురు చెబుతున్న మాట. పెద్దలు అందరూ యువతను పుస్తకాల వైపు ప్రోత్సహించాలి' అని గవర్నర్ సూచించారు.

## ఫార్ములా ఈ-రేసు కేసు

### కెటీఆర్‌కు ఇడి నోటీసులు




హైదరాబాద్,డిసెంబర్28ఆంధ్ర ప్రగతి: ఫార్ములా ఈ-రేసు కేసులో భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు ఈడీ నోటీసులు ఇచ్చింది. జనవరి 7న విచారణకు రావాలని అందులో పేర్కొన్నారు. సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్‌కు, హెచ్‌ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్‌ఎన్ రెడ్డికి కూడా ఈడీ నోటీసులు ఇచ్చింది. జనవరి 2, 3న విచారణకు రావాలని అరవింద్, బీఎల్‌ఎన్ రెడ్డికి ఇచ్చిన నోటీసుల్లో పేర్కొన్నారు. ఏసీబీ ఎఫ్ఐఆర్ ఆధారంగా పీఎంఎల్ఏ కింద ఈడీ విచారణ చేస్తోంది.

## నితీశ్ సెంచరీ..తగ్గేదేలేదంటూ స్టైల్

### తెలంగాణ సిఎం రేవంత్‌పై అంబటి మరో కామెంట్



గుంటూరు,డిసెంబర్28ఆంధ్ర ప్రగతి:
భారత్, ఆస్ట్రేలియా మధ్య మెల్‌బోర్న్‌లో జరుగుతున్న బాక్సింగ్ డే టెస్ట్ మ్యాచ్‌లో తెలుగు కుర్రాడు నితీశ్ రెడ్డి అద్భుతం సృష్టించి శతకం బాదాడు. ఎనిమిదో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి కష్టాల్లో ఉన్న జట్టును ఆదుకున్నాడు. సీనియర్లంతా నిరాశపర్చినా ఆసీస్ బౌలర్లను ఆడుకున్నాడు. ఒక సిక్స్, 9 ఫోర్లతో సెంచరీతో కదం తొక్కాడు. దీంతో అతడిపై ప్రశంసలు వెల్లువెత్తు తున్నాయి. అయితే, అతడు అర్ధ శతకం నమోదు చేసిన సమయంలో పుష్ప స్టైల్‌లో 'తగ్గేదేలే' అంటూ మేనరిజంతో సంబురాలు చేసుకున్నాడు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. అతడి పుష్ప స్టైల్ సెలబ్రేషన్స్‌పై వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు స్పందించారు. 'ప్రపంచాన్నే ప్రభావితం చేస్తున్న పుష్ప.. హీరోని వేధిస్తూ తెలుగు సినిమాని అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్తానంటే నమ్మేదెలా అబ్బా.. ?' అంటూ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిపై సెటైర్లు వేశారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఈ పోస్ట్‌కు నితీశ్ వీడియోని కూడా షేర్ చేశారు. కాగా, సంధ్యా థియేటర్ ఘటన, అల్లు అర్జున్ అరెస్టు నేపథ్యంలో రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లో టాలీవుడ్ ప్రముఖులు సీఎం రేవంత్ రెడ్డిన కలిసిన విషయం తెలిసిందే. ఆ సందర్భంగా కూడా అంబటి ఓ ఆసక్తికర ట్వీట్ పెట్టారు. 'పూర్తి పరిష్కారానికి 'సోఫా' చేరాల్సిందే..!' అంటూ ఆయన పెట్టిన పోస్టు సంచలనం రేపింది. ఎందుకంటే.. పుష్ప-2 మూవీలో 'సోఫా' సీన్లు ఉంటాయన్న విషయం తెలిసిందే. తనకు వ్యతిరేకంగా ఉన్న వాళ్లను కొనేందుకు, అనుకూలంగా పనిచేసేవాళ్లకు పుష్పరాజ్ 'సోఫా' పంపిస్తుంటారు. అందులో పెద్ద మొత్తంలో డబ్బు ఉంచి లంచంగా ఇస్తుంటారు. ఇదే అంశాన్ని అంబటి రాంబాబు ప్రస్తావిస్తూ.. 'సోఫా' పంపితేనే సినీ ఇండస్ట్రీ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందంటూ వ్యాఖ్యానించారు. ఈ ట్వీట్ చూసిన నెటిజన్లు రకరకాలుగా స్పందించారు. 'పుష్ప వివాదానికి.. పుష్పరాజ్ తరహాలోనే పరిష్కారమా..?' అంటూ కామెంట్ల వర్షం కురిపించారు. ఇప్పుడు మరోసారి అదే తరహా ట్వీట్ పెట్టడం చర్చనీయాంశంగా మారింది.

## నితీశ్ సెంచరీకి నేతల ఫిదా

### ప్రశంసల వర్షం కురిపించిన చంద్రబాబు

అమరావతి,డిసెంబర్28ఆంధ్ర ప్రగతి:
ఆస్ట్రేలియా గడ్డపై అద్భుతమైన సెంచరీతో చెలరేగిన తెలుగు తేజం నితీష్ కుమార్ రెడ్డి మీద అన్ని వైపుల నుంచి ప్రశంసల వర్షం కురుస్తోంది. కష్టకాలంలో క్రీజులోకి అడుగుపెట్టి అతడు చేసిన పోరాటం, కంగారూ బౌలర్లకు ఎదుర్కొడ్డి జట్టును ఓటమి నుంచి బయటపడేసిన తీరుకు అంతా ఫిదా అవుతున్నారు. 21 ఏళ్ల కుర్రాడు.. ఎంతో అనుభవం ఉన్న రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ కూడా చేయలేని పనిని చేసి చూపించడం, ఆసీస్ బౌలర్లను ఆటాడుకోవడాన్ని అంతా మెచ్చుకుంటున్నారు. నితీష్ సంచలన ఇన్నింగ్స్ మీద ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు స్పందించారు. గర్వపడేలా చేశావ్ అంటూ తెలుగోడ్ని మెచ్చుకున్నారు. సూపర్బ్ సెంచరీ సాధించిన నితీష్ రెడ్డికి చంద్రబాబు అభినందనలు తెలిపారు. టెస్టుల్లో అత్యంత పిన్న వయసులో శతకం బాదిన భారత మూడో క్రికెటర్‌గా నిలవడం గొప్ప విషయమని ప్రశంసించారు. రంజీలో ఆంధ్ర జట్టు తరఫున ఎన్నో విజయాలు సాధించిన నితీష్.. అండర్-16లో కూడా అదరగొట్టాడని గుర్తుచేశారు చంద్రబాబు. అతడు తన కెరీర్‌లో మరిన్ని అద్భుతమైన విజయాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. టీమిండియా తరఫున ఇలాగే చెలరేగుతూ దేశ కీర్తిప్రతిష్టలను ఇనుమడింప చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని ట్విట్టర్‌లో పెట్టిన పోస్ట్‌లో ముఖ్యమంత్రి తెలిపారు. మంత్రులు నారా లోకేశ్, రాంప్రసాద్ రెడ్డి కూడా నితీష్‌ను మెచ్చుకున్నారు. తెలుగు వారి ప్రతిష్టను ప్రపంచ యవనికపై మారుమోగిస్తున్నందుకు అతడికి థ్యాంక్స్ చెప్పారు లోకేశ్. స్వర్ణాంధ్ర ఇలాగే సాధ్యమవుతుందని, అన్ని అడ్డంకులను దాటుకొని దూసుకెళ్తే ఏదైనా సాధ్యమేనని ట్వీట్ చేశారు. ఫాలోఆన్ ప్రమాదంలో ఉన్న భారత్‌ను అద్భుత శతకంతో ఆదుకున్నాడని రాంప్రసాద్ రెడ్డి కొనియాడారు. నితీశ్ మున్ముందు టీమిండియాకు మరిన్ని విజయాలు అందించాలని మంత్రి ఆకాంక్షించారు. తెలుగోడి సూపర్బ్ బ్యాటింగ్‌పై దిగ్గజ ప్లేయర్ వీవీఎస్ లక్ష్మణ్ కూడా స్పందించాడు. టీమ్ కష్టాల్లో ఉన్న టైమ్‌లో నితీష్ ఆడిన తీరు అద్భుతమని.. ఇది అతడికి ఆరంభం మాత్రమేనని ప్రశంసించాడు. నితీష్ బ్యాటింగ్‌లో ఉన్న పాజిటివిటీ, ఫియర్‌లెస్‌నెస్‌ను తాను ఆస్వాదించానని వీవీఎస్ తన ట్వీట్‌లో రాసుకొచ్చాడు.

## ప్రధాని మోదీని కలిసిన గుకేశ్!



డిసెంబర్28ఆంధ్ర ప్రగతి:
వరల్డ్ చెస్ ఛాంపియన్ గుకేశ్ నేడు ఢిల్లీలో ప్రధాని మోదీని కలిశాడు. తాను వరల్డ్ టైటిల్ గెలుచుకునే క్రమంలో ఫైనల్లో ఆడిన చెస్ బోర్డును ప్రధానికి కానుకగా ఇచ్చాడు. దీనిపై ప్రధాని మోదీ సోషల్ మీడియాలో స్పందించారు."చెస్ ఛాంపియన్, భారతదేశపు గర్వకారణమైన గుకేష్‌తో సంభాషణ అద్భుతంగా సాగింది. నేను కొన్ని సంవత్సరాలుగా గుకేష్ తో సన్నిహితంగా సంభాషిస్తున్నాను, అతనిలో నాకు ఎక్కువగా కనిపించేది అతని సంకల్పం, అంకితభావం. అతని ఆత్మవిశ్వాసం నిజంగా స్ఫూర్తిదాయకం. వాస్తవానికి, కొన్నేళ్ల కిందటి ఓ వీడియోలో గుకేశ్ ఏం చెప్పాడో నాకు గుర్తుంది. తాను చిన్న వయసులోనే వరల్డ్ చాంపియన్ అవుతానని చెప్పాడు. తన స్వయంకృషితో దాన్ని సాధ్యం చేసి చూపించాడు." అంటూ ప్రధాని మోదీ ట్వీట్ చేశారు.కాగా, ఇటీవల సింగపూర్ వేదికగా జరిగిన ప్రపంచ చెస్ ఛాంపియన్ షిప్ ఫైనల్లో డింగ్ లిరెన్ పై గుకేశ్ అద్భుత విజయం సాధించాడు. 18 ఏళ్ల వయసులో గుకేశ్ సాధించిన ఈ ఘనత చదరంగం పండితులను సైతం ఆకట్టుకుంది.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక


# మహేశ్‌బాబు మూవీలో ప్రియాంక చోప్రా



మహేశ్ బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో రానున్న ఓ చిత్రంలో ప్రియాంక చోప్రా ఛాన్స్ కొట్టేసింది. ఎంబి29'గా ఇది ప్రచారంలో ఉంది. ప్రస్తుతం సినీ ప్రియులంతా ఎదురుచూస్తున్న చిత్రాల్లో ఇదీ ఒకటి. తాజాగా దీనికి సంబంధించిన కొన్ని అప్‌డేట్‌లు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఇండోనేషియా నటి చెల్సియా ఎలిజబెత్ ఇస్లాన్ ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటించనున్నట్లు గతంలో వార్తలు జోరుగా ప్రచారం అయ్యాయి. ఇప్పుడు మరో నటి పేరు తెరపైకి వచ్చింది. బాలీవుడ్ టాలెంటెడ్ హీరోయిన్ ప్రియాంక చోప్రా ఈ సినిమాలో నటించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఆమెతో చర్చలు జరిపినట్లు టాక్ వినిపిస్తుంది. ఇందులో హీరోతోపాటు హీరోయిన్ పాత్రకు ప్రాధాన్యం ఉంటుందని ప్రియాంక అయితే ఆ పాత్రకు న్యాయం చేయగలదని చిత్రబృందం భావిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే ఆమెను తీసుకునే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. ప్రియాంక కూడా ఈ సినిమాలో నటించేందుకు ఆసక్తిగా ఉన్నారట. ఈ పాత్ర కోసం ఇప్పటికే ఆమె ప్రిపరేషన్ కూడా మొదలుపెట్టారట. ఇక ఈ సినిమా షూటింగ్‌కు సంబంధించిన అప్‌డేట్ కూడా సోషల్ మీడియాలో షేర్ అవుతోంది. ఏప్రిల్ నుంచి ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు.





# బేబీ బంప్ ఫోటోలతో సామ్ హల్‌చల్

టాలీవుడ్ స్టార్ నటి సమంత గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. తన అందం, అభినయంతోపాటు నటనతో కోట్లాది మంది అభిమానుల్ని సొంతం చేసుకుంది. ఏమాయ చేశావే చిత్రంతో తెలుగు ఇండస్ట్రీకి పరిచయమైన ఈ సుందరి.. అతి కొద్ది రోజుల్లోనే స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకుంది. అనంతరం మంచి ఫామ్‌లో ఉండగానే టాలీవుడ్ నటుడు నాగచైతన్యను ప్రేమపెళ్లి చేసుకుంది. ప్రస్తుతం అతడితో విడాకులు తీసుకుని సింగిల్‌గా ఉంటోంది. ఈ క్రమంలో సమంతకు సంబంధించిన కొన్ని ఫొటోలు ప్రస్తుతం నెట్టింట షేక్ చేస్తున్నాయి. ఆ ఫొటోల్లో సామ్ బేబీ బంప్ తో కనిపించడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. అయితే, అవి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో రూపొందించినవిగా తెలిసింది. ఏఐ సాయంతో సమంత బేబీ బంప్ ఫోటోలను క్రియేట్ చేసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఇవి కాస్తా వైరల్ కావడంతో నెటిజన్లు, అభిమానులు షాక్ అవుతున్నారు. నాగచైతన్యతో విడాకుల అనంతరం మాతృత్వాన్ని అనుభవించాలని ఉందంటూ సామ్ అప్పట్లో చెప్పుకొచ్చిన విషయం తెలిసిందే. ఇప్పుడు బేబీ బంప్ ఫోటోలు చూసిన వారంతా ఈ విషయాన్నే గుర్తు చేసుకుంటున్నారు.

# మార్కో తెలుగు ట్రైలర్ విడుదల




ఉన్ని ముకుందన్ కథానాయకుడిగా హనీఫ్ దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ థ్రిల్లర్ 'మార్కో' ఇటీవల మలయాళంలో విడుదలైన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపిస్తోంది. రూ.30కోట్లతో నిర్మించిన ఈ చిత్రం విడుదలైన వారంలో రోజుల్లోనే రూ.80కోట్లకు పైగా వసూలు చేసినట్లు ట్రేడ్ వర్గాలు లెక్కగట్టాయి. ఇప్పుడు తెలుగు ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమైంది. నూతన సంవత్సరం సందర్భంగా జనవరి 1న ఈ చిత్రం విడుదల కానుంది. తాజాగా చిత్ర ట్రైలర్ విడుదలైంది. యాక్షన్ సన్నివేశాలను పెద్ద పీట వేసినట్లు ప్రచార చిత్రాలు చూస్తే అర్థమవుతోంది.

# సిఎం మీటింగ్‌తో అపోహలు తొలగిపోయాయి

## :నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ



ఇండస్ట్రీకి, ప్రభుత్వానికి మధ్య గ్యాప్ వచ్చిందనే అపోహ సిఎంతో జరిగిమీటింగ్‌తో తొలగిపోయిందని నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ అన్నారు. అది బెస్ట్ మీటింగ్ అని అక్కడికి వెళ్లినవాళ్లు నాతో చెప్పారు. ఫిల్మ్ ఛాంబర్ తరఫున మేము గతంలో ప్రభుత్వాన్ని కలిశాం. గద్దర్ అవార్డుల విషయంలో కొన్ని సలహాలిచ్చాం. గతంలో మేము కూడా కొన్ని సినిమాలకు బెనిఫిట్ షోలు వేశాం. కానీ, ఉచితంగా ప్రదర్శించాం. ప్రస్తుతం ఆ పరిస్థితి మారిపోయింది. దీని గురించి ప్రేక్షకులు, నిర్మాతలు ఆలోచించాలి. తాజాగా విడుదలైన 'పుష్ప2' అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంది. అంటే మనం ఇప్పటికే ఇంటర్నేషనల్ స్థాయికి చేరాం. అన్ని భాషల్లో సినిమాలు తీస్తున్నాం.సీఎం మాట్లాడినట్లు సమాచారం. ఇండస్టీ వాళ్లకు గవర్నమెంట్ దగ్గరకు తరచూ వెళ్లాల్సిన అవసరం లేదు. ఏదైనా సమస్యలు ఉన్నప్పుడే కలుస్తాం. 'గతంలో చెన్నై నుంచి ఇండస్టీ హైదరాబాద్ రావడానికి 40 ఏళ్లు పట్టింది. ఇక్కడి నుంచి మరోచోటకు వెళ్లాలన్నా అంత సమయమే పడుతుంది. చిరంజీవి కుటుంబం నుంచి మీటింగ్‌కు ఎవరూ ఎందుకు వెళ్లలేదో నాకు తెలియదు. బహుశా వారికి ఏమైనా ముఖ్యమైన పనులు ఉన్నాయేమో. ఇండస్ట్రీలో ఉన్న వారందరూ నాకు పిల్లలతో సమానం. అల్లు అర్జున్‌కు నేషనల్ అవార్డు వచ్చినప్పుడు సంతోషించాను. అలానే సంధ్య థియేటర్ ఘటనపై కూడా తాజాగా నా అభిప్రాయాన్ని చెప్పాను. నా ఉద్దేశం ఎవరినీ బాధపెట్టడం కాదు. నా పిల్లలతో సమానం కాబట్టి వాళ్ల గురించి మాట్లాడతాను. కొందరి మాట వింటే భవిష్యత్తు బాగుంటుంది. మరి కొందరికి దూరంగా ఉండండి అని చెప్పడానికి ప్రయత్నం చేస్తుంటాను' అని తమ్మారెడ్డి భరద్వాజ చెప్పారు.

# భాగ్య శ్రీ సుడి తిరిగితే మాత్రం..!



సరిగ్గా ఇండస్ట్రీలో హీరోయిన్స్ కొరత ఉన్నప్పుడే ఎంట్రీ ఇచ్చిన భామ భాగ్య శ్రీ బోర్స్. బాలీవుడ్ లో యారియాన్ 2 తో ఎంట్రీ ఇచ్చిన అమ్మడు హరీష్ శంకర్ దృష్టి పడింది. దాంతో మాస్ మహారాజ్ రవితేజతో చేసిన మిస్టర్ బచ్చన్ కోసం ఎంపిక చేశారు. ఆ సినిమా కమర్షియల్ గా వర్క్ అవుట్ కాకపోయినా సరే భాగ్య శ్రీకి మాత్రం మంచి పాపులారిటీనే తెచ్చింది. ముఖ్యంగా మిస్టర్ బచ్చన్ లో అమ్మడి గ్లామర్ షోకి కుర్రాళ్లు ఫిదా అయ్యారు. అందుకే ఆడియన్స్ లో ఆమెకున్న ఐడెంటిటీ చూసి వరుస ఆఫర్లు ఇస్తున్నారు. షో ఇప్పటికే విజయ్ దేవరకొండ తో ఒక సినిమా చేస్తున్న భాగ్య శ్రీ ఆ సినిమాతో కచ్చితంగా హిట్ కొట్టేలా ఉంది. విజయ్ సినిమాలో హీరోయిన్స్ కి మంచి ప్రాధాన్యత ఉంటుంది. గౌతం తిన్ననూరి డైరెక్షన్ లో వస్తున్న సినిమా కాబట్టి ఈ మూవీపై భారీ హైప్ ఉంది. ఇక మరోపక్క దుల్కర్ సల్మాన్ తో కాంతా సినిమా కూడా చేస్తుంది భాగ్య శ్రీ. తెలుగు, తమిళ్ భాషల్లో తెరకెక్కే ఈ సినిమాతో భాగ్య శ్రీ మళ్లీ చర్చల్లో నిలుస్తుంది. అటు విజయ్, ఇటు దుల్కర్ ఇద్దరితో అమ్మడు స్క్రీన్ షేర్ చేసుకుంటుంది. ఈ రెండిటిలో ఏ ఒక్క సినిమా హిట్ అయినా కచ్చితంగా భాగ్య శ్రీకి మంచి క్రేజ్ వస్తుందని చెప్పొచ్చు. ఇప్పటికే భాగ్య శ్రీ ఫోటో షూట్స్ తో సోషల్ మీడియాలో వేడి పెంచేస్తుంది. అటు సినిమాలు ఇటు ఫోటో షూట్స్ రెండిటిలో భాగ్యాన్ని చూసి ఆడియన్స్ వారెవా అనేస్తున్నారు. ఒక సినిమా హిట్ పడితే మాత్రం అమ్మడు టాలీవుడ్ లో టాప్ ప్లేస్ కి వెళ్లినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదని చెప్పొచ్చు. ప్రస్తుతం సీనియర్ హీరోయిన్స్ అంతా సైడ్ అయిన ఈ టైం లో వచ్చిన ప్రతి ఛాన్స్ ని పర్ఫెక్ట్ గా వాడుకుంటే మాత్రం భాగ్య శ్రీ బోర్స్ కి తిరుగు ఉండదని చెప్పొచ్చు. ముఖ్యంగా అమ్మడి గ్లామర్ షోకి సెపరేట్ క్రేజ్ ఏర్పడుతుంది కాబట్టి అమ్మడు అదే రేంజ్ లో రెచ్చిపోతే ఆమె కెరీర్ కు ప్లస్ అవుతుందని చెప్పొచ్చు. ఒక్క హిట్ పడి భాగ్య శ్రీ సుడి తిరిగితే మాత్రం కచ్చితంగా మిగతా హీరోయిన్స్ కి టఫ్ కాంపిటీషన్ అవుతుందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.

# పుష్ప-2 నుంచి షెకావత్ పాట విడుదల




అల్లు అర్జున్ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'పుష్ప 2 ది రూల్' సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమాలో రష్మిక కథానాయిక నటించింది. డిసెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే వరల్డ్ వైడ్‌గా రూ.1700 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది ఈ చిత్రం. అయితే ఈ మూవీ నుంచి ఫుల్ వీడియో సాంగ్‌లను ఒక్కొక్కటిగా వదులుతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే 'పుష్ప రాజ్' సాంగ్‌తో పాటు 'దెబ్బలు పడతాయ్ రో.. దెబదెబ్బలు పడతాయ్ రో.. కిస్ కిస్ కిస్సిక్' సాంగ్‌లను విడుదల చేసిన చిత్రబృందం తాజాగా మూవీలో ఇంటర్వెల్ ముందు వచ్చే దమ్ముంటే పట్టుకోరా షెకావత్ పట్టుకుంటే వదిలేస్తా సిండికేట్ అనే సాంగ్‌ను విడుదల చేసింది. థియేటర్‌లో ఉద్రుతలు ఊగించిన ఈ సాంగ్ విడుదలయ్యింది.